PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 180 | విజయవాడ, బుధవారం 1 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Wednesday 1 February 2023 | Rs

నెల్లూరు వైసిపిలో ప్రకంపనలు!

- ఇద్దరు ఎంఎల్ఎలు టిడిపి గూటికి?
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికార పార్టీ!

• లోపలి పేజీలో.. •

జార్ఖండ్‌లో ఘోరం

- ధన్‌బాద్‌లో అగ్నికీలల్లో అపార్ట్‌మెంట్
- మంటల్లో చిక్కుకుని 14 మంది మృతి

రాంచీ : జార్ఖండ్‌లో మంగళవారం సాయంత్రం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ధన్‌బాద్ జిల్లాలో జోరాపాఠక్‌లోని ఒక బహుళ అంతస్తుల భవనంలో జరిగిన ఈ దుర్ఘటనలో 14 మంది చనిపోయారు. వీరిలో నలుగురు చిన్నారులు ఉన్నట్లు సమాచారం. భవనం మొత్తం అగ్ని కీలలు ఎగిసి పడుతుంటడంతో మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చునని సంబంధిత అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. రాజధాని రాంచీకి సుమారు 160 కిలోమీటర్లు దూరంలో జోరాపాఠక్ ఉంది. ఇక్కడి ఆశీర్వాద్ టవర్‌లో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అగ్గి రాజుకున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణాలు నిర్థిష్టంగా తెలియరాలేదు.

ముందున్నది మాంద్యం మంట



- వృద్ధి 6.5 శాతానికి కుదింపు • ద్రవ్యోల్బణం అనివార్యం
- ప్రజలకు ధరల పోటు • మానిటైజేషన్ దూకుడు
- కార్పొరేట్ల చేతుల్లోకి ద్రవ్య వ్యవస్థ • ఆర్థిక సర్వే నిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

భారత ఆర్థిక వ్యవస్థపై మాంద్యం ప్రభావం చూపిస్తోందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థ స్థాయికి దేశం దూసుకుపోతుందని ఒక వైపు ఊదరగొడుతూనే మరో వైపు మాంద్యంతో వచ్చే సంవత్సరం వృద్ధి మందగిస్తుందని హెచ్చరించింది. ప్రజలకు ధరల మంట తప్పదని పేర్కొంది. అంతర్జాతీయంగా రూపాయి మారకం విలువ పడిపోతుందని, కరెంట్ ఖాతా లోటు ఎక్కువవుతుందని తెలిపింది. గడచిన కొన్నేళ్లకు మాదిరిగానే కార్పొరేట్లకు మేలు చేసే చర్యలను ఏకరువు పెట్టింది. ప్రైవేటీకరణ జపం చేసింది. ప్రభుత్వ ఆస్తుల అమ్మకం లక్ష్యాలు సాధించామని, వచ్చే ఏడాది మరిన్ని ప్రభుత్వ ఆస్తులను అమ్మాలని సలహా ఇచ్చింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభంకాగా, 2022-23 సంవత్సరానికి ఆర్థిక సర్వేని విత్త మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ ఆర్థిక సర్వేని రూపొందించారు.

వృద్ధి కిందికి

ప్రస్తుత ఏడాదిలో జాతీయ స్థూలోత్పత్తి (జిడిపి) వృద్ధిని 7 శాతంగా అంచనా వేసిన ఆర్థిక సర్వే వచ్చే ఏడాది 6.5 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. ప్రపంచంలో నెలకొన్న మాంద్యం పరిస్థితుల వలన వృద్ధి మందగిస్తుంది. కోవిడ్ అనంతరం ఆర్థిక కార్యకలాపాలు కాస్తంత పుంజుకున్నాయి. అన్ని రంగాల్లో వృద్ధి కొనసాగుతోంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం 7.8 శాతం వద్ద ఏడాదంతా స్థిరంగా కొనసాగింది. ఆర్‌బిఐ విధించిన పరిమితి 6 శాతం కంటే చాలా ఎక్కువ. రానున్న సంవత్సరంలోనూ ద్రవ్యోల్బణం 6.8 శాతం ఉండొచ్చు. కాగా ద్రవ్యోల్బణం పెరుగుదల ఆర్థిక పరిస్థితి అదుపునకు సాధ్యమైందని సర్వే అభిప్రాయపడింది. అయితే ద్రవ్యోల్బణం, అందులోనూ రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుదల నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైందన్న విషయాన్ని ఆర్థిక సర్వేలో నర్మగర్భంగా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక ఒడుదుడుకులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీ రేట్ల పెంపు వలన మన రూపాయి విలువ పతనం అవుతుంది. ఆ ఫలితంగా కరెంట్ ఖాతాలోటు పెరుగుతుంది. ఎగుమతులు మందగించే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆస్తుల అమ్మకం

ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు అమ్మేందుకు ఉద్దేశించిన మానిటైజేషన్‌కు ఆర్థిక సర్వే జైకొట్టింది. ఈఏడాది రూ.80 వేల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాలన్నది టార్గెట్ కాగా అంతకంటే ఎక్కువ రూ.90 వేల కోట్ల ఆస్తులు అమ్మడానికి నిర్ణయించారు. ఇదే ఊపులో వచ్చే ఏడాది మానిటైజేషన్ లక్ష్యం రూ.1.6 లక్షల కోట్లు పెట్టుకోవాలని ఆర్థిక సర్వే నిర్దేశించింది. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ ద్వారా రూ.141 లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రైవేటుకు ఇవ్వాలి. 'ఉడాన్' పథకంలో కోటి మంది విమాన ప్రయాణీకులకు సౌకర్యం లభించింది. డిజిటల్ ఇండియాలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం 200 శాతం పెరిగింది. దేశంలో 117.8 కోట్ల టెలిఫోన్ వినియోగదారులుండగా వారిలో 44.3 శాతం గ్రామీణ వాసులు. టెలిఫోన్లలో మిగతా 5లో

రాజధాని విశాఖ

• నేను కూడా షిఫ్ట్ అవుతున్నా • కలకలం రేపిన సిఎం వ్యాఖ్యలు

అక్కడి సదస్సుకు రావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నం త్వరలో రాష్ట్ర రాజధాని కాబోతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. త్వరలో తాను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నట్లు చెప్పారు. ఢిల్లీలోని లీలా ప్యాలెస్‌లో మంగళవారం జరిగిన ఇంటర్నేషనల్ డిప్లమాట్ అలియన్స్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'మార్చి మూడు, నాలుగు తేదీల్లో విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు జరుగుతోంది. అదే రాజధాని ...విశాఖపట్నం. కొన్ని నెలల్లో నేను కూడా అక్కడికి షిఫ్ట్ అవుతున్నా. మిమ్మల్ని విశాఖకు ఆహ్వానిస్తున్నా. త్వరలో అక్కడ కలవాలని ఆశిస్తున్నా.' అని అన్నారు. న్యాయస్థానాల్లో ఒక వైపు విచారణ ప్రక్రియ జరుగుతుండగానే విశాఖపట్నంను రాజధానిగా పేర్కొంటూ సిఎం చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఇప్పటివరకు మూడు రాజధానులు తమ విధానమని చెబుతూ, విశాఖను పాలనా రాజధాని చేస్తామని సిఎంతో పాటు వైసిపి నేతలు చెబుతున్న విషయం తెలిసిందే. అయితే, తాజా సమావేశంలో మాత్రం ఆ అంశాన్ని సిఎం ప్రస్తావించలేదు. దానికి బదులుగా 'రాజధాని విశాఖ' అని అన్నారు. సిఎం ఈ వ్యాఖ్యలు చేసిన కాసేపటికే ఒకరిద్దరు వైసిపి సీనియర్ నేతలు విశాఖలో రాజధానికి అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైతే అద్దె భవనాలు తీసుకునే అవకాశం కూడా ఉందని స్పందించారు. మరోవైపు సిఎం వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారడంతో 'విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతోంది. విశాఖలో పెట్టుబడులకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నాను' అని సిఎం అన్నట్లు మీడియాకు నోట్‌విడుదల చేశారు.

అనుకూలమైన రాష్ట్రం

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని సిఎం చెప్పారు. 1.43 శాతం జిఎస్‌డిపితో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా గడిచిన మూడేళ్లుగా ఏపి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్రానికి 974 మీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉందని, నాలుగు ప్రాంతాల్లో 6 పోర్టులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. వీటికి అదనంగా మరో నాలుగు పోర్టులను మిగతా 5లో



పెట్టుబడుదార్ల సదస్సులో మాట్లాడుతున్న సిఎం జగన్

మోసపూరితం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిని, ముఖ్యమంత్రి నివాసాన్ని వైజాగ్‌కు మారుస్తానని జగన్ మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన మోసపూరితమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మూడు రాజధానులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని ఉపసంహరించుకుందని, హైకోర్టు అమరావతి రాజధానిని అభివృద్ధి చేయాలని ఆదేశించిందని తెలిపారు. హైకోర్టు తీర్పును ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ సుప్రీం కోర్టు తిరస్కరించిందని వివరించారు. కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుందని, ముఖ్యమంత్రి ప్రకటన కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి నివాసం మారినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను తప్పుదారి పట్టించడానికి, రియల్ ఎస్టేట్‌లో స్పెక్యులేషన్ పెంచడానికే తోడ్పడుతుందని విమర్శించారు. ఉత్తరాంధ్రకు నిధులిచ్చి అభివృద్ధి చేయకుండా, విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తుంటే గుడ్లప్పగించి చూస్తూ రాజధాని పేరుతో మోసం చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి జిమ్మిక్కులకు బదులు.. రాజధానిగా అసెంబ్లీలో వైసిపి సహా ఏకగ్రీవ ఆమోదంతో నిర్మాణం మొదలై ఇప్పటికే ఎంతో డబ్బు వెచ్చించిన అమరావతిని అభివృద్ధి చేయాలని డిమాండు చేశారు.

ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే : టిడిపి


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల మధ్య చిచ్చు పెట్టాలనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ రాజధాని అంటూ ప్రకటన చేశారని టిడిపి విమర్శించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ విడుదల చేసిన ప్రకటనలో అమరావతిని రాజధానిగా ఆమోదించిన జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం సైకోలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సిబిఐ కేసులో ఆయనపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకే ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. జగన్ కుటుంబ సభ్యుల ఆడియోల లీకవుతున్న సమయంలో కావాలనే విశాఖ రాజధాని ప్రకటన చేశారన్నారు. విశాఖ రాజధాని కావాలని ఎవరూ అడగలేదని, దోచుకునేందుకే కొత్త డ్రామా మొదలుపెట్టారని అన్నారు. ఇప్పటికే 40 వేల కోట్ల విలువ చేసే భూములను దోచుకున్నారని తెలిపారు. సమస్య సుప్రీం కోర్టులో ఉంటే ప్రకటన చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

సుప్రీంకోర్టంటే గౌరవం లేదు : సిపిఐ

సుప్రీంకోర్టు అంటే సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఏ మాత్రమూ గౌరవం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కేసు విచారణలో ఉండగానే విశాఖ రాజధాని అని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. అమరావతిని అభివృద్ధి చేయాలని ఎపి హైకోర్టు తీర్పు ఇచ్చిందని దీంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లునూ ఉపసంహరించుకుందని తెలిపారు. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా కనీసం స్టేకూడా ఇవ్వలేదని అయినా విశాఖలో రాజధాని అని చెప్పడం నియంతృత్వమని తెలిపారు.

టాప్-10 కుబేరుల నుంచి అదానీ ఔట్



ముంబయి : అదానీ గ్రూపు కంపెనీలు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు గౌతం అదానీ ఊహించని నష్టాలు చవి చూశారు. స్టాక్ మార్కెట్లలో వరుస భారీ నష్టాలతో అదానీ టాప్ -10 కుబేరుల జాబితాలో చోటు కోల్పోయారు. కేవలం మూడు రోజుల్లోనే లక్షల కోట్ల రూపాయల విలువను నష్టపోయారు. దీంతో ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానం నుంచి ఏకంగా 11వ స్థానానికి దిగజారారని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ మంగళవారం ఓ రిపోర్టులో తెలిపింది. 2023 జనవరి మాసంలో 36 బిలియన్ డాలర్ల (రూ.2.94 లక్షల కోట్లు) వ్యక్తిగత సంపదను నష్టపోయారు. ప్రస్తుతం ఆయన వ్యక్తిగత సంపద 84.4 బిలియన్ డాలర్ల (రూ.6.90 లక్షల కోట్లు)కు తగ్గిందని అని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. మూడు సెషన్లలో అదానీ గ్రూప్ సంస్థలు 25 శాతం మార్కెట్ విలువను కోల్పోయాయని వెల్లడించింది.



సంకల్ప దీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓపిఎస్ కోసం ఫిబ్రవరి 3న సంకల్ప దీక్ష

- సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను ఒప్పుకోం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) అమల్జేస్తామని పాదయాత్రలో చేసిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యుటిఎఫ్) కోరింది. ఓపిఎస్‌కు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటెడ్ పెన్షన్ విధానం (జిపిఎస్) అమల్జేయడానికి పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ తెలిపింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న గన్నవరం సమీపంలోని ధర్మస్థలిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్ప దీక్షను చేపడుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణ సుందరరావు తదితరులు సంకల్ప దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ఎస్ ప్రసాద్, ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ముఖ్యమంత్రి కాకముందు జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అధికారంలోకి వచ్చాక వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు మిగతా 5లో

అవినీతే అతి పెద్ద శత్రువు

- పార్లమెంటు ప్రసంగంలో రాష్ట్రపతి
- బహిష్కరించిన బిఆర్ఎస్, ఆప్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అవినీతే అతి పెద్ద శత్రువు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సెంట్రల్ హాలులో ఉభయసభల సభ్యుల నుద్దేశించి ఆమె ప్రసంగించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ద్రౌపది ముర్ము లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో ప్రసంగించడం ఇదే మొదటిసారి. దేశం ఆత్మ నిర్భర్ భారత్‌గా ఆవిర్భవిస్తోందని చెప్పిన ఆమె ఆ ప్రస్తానానికి అవినీతే ఆటంకంగా మారిందని అన్నారు. అవినీతిపై తన ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడి, పరారయ్యే నేరగాళ్ళ ఆస్తులను జప్తు చేసేందుకు ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ యాక్ట్‌ను తన ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అవినీతి రహిత దేశంగా మారే దిశగా భారత్ పయనిస్తోందన్నారు. వరుసగా రెండుసార్లు సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. విధానపరమైన వ్యూహాన్ని సమూలంగా మార్చే దృఢ నిశ్చయాన్ని ప్రదర్శిస్తుందన్నారు. 2047 నాటికి మన దేశాన్ని పూర్వ వైభవం, ఆధునిక కాలపు సువర్ణాధ్యాయాల అనుసంధానంతో నిర్మించాలని ఆకాంక్షించారు. నేడు ప్రపంచం మనల్ని చూస్తున్న తీరు అద్భుతమని తెలిపారు. గతంలో మనం ప్రపంచంపై ఆధారపడేవారమని, ఇప్పుడు ప్రపంచమే మనపై ఆధారపడుతోందని చెప్పారు. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపగలుగుతున్నామని చెప్పారు. పేదరికంలేని దేశాన్ని నిర్మించాలన్నారు. మధ్య తరగతి ప్రజలు కూడా సంపన్నులు కావాలన్నారు. సమాజానికి, దేశానికి దిశా నిర్దేశం చేయడానికి యువత, నారీశక్తి ముందు వరుసలో ఉండాలని తెలిపారు పన్ను చెల్లింపుదారులు తాము చెల్లించిన పన్ను రిఫండ్ కోసం గతంలో సుదీర్ఘ సమయం ఎదురు చూడవలసి వచ్చేదని తెలిపారు. నేడు ఐటిఆర్ ను దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే రిఫండ్ పొందగలుగుతున్నారన్నారు. ఒక దేశం-ఒకే రేషన్ కార్డ్, జన్ ధన్-ఆధార్-మొబైల్ నంబర్ల అనుసంధానం వల్ల నకిలీ లబ్ధిదారులను తొలగించగలిగినట్లు తెలిపారు. అతి పెద్ద శాశ్వత సంస్కరణను అమలు చేశామని చెప్పారు.

రక్షణ రంగంలో పెరిగిన ఎగుమతులు

ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా రక్షణ రంగంలో ఎగుమతులు ఆరు రెట్లు పెరిగాయని ద్రౌపది ముర్ము చెప్పారు. ఐఎన్ఎస్ విక్రాంత్ రూపంలో తొలి స్వదేశీ విమాన వాహక నౌక నావికా దళంలో చేరడం గర్వకారణమని తెలిపారు. మానవతావాద కర్తవ్యాలను నెరవేర్చగలిగే స్వయం సమృద్ధ దేశాన్ని మనం నిర్మించాలన్నారు. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బిఆర్ఎస్, ఆప్ బహిష్కరించాయి.

నేడు కేంద్ర బడ్జెట్

- లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

• లోపలి పేజీలో... •

దళితులపై పెత్తందార్ల దాడి

- ఆసుపత్రి పాలైన బాధితులు

ప్రజాశక్తి -భట్టిప్రోలు (బాపట్ల)

నది పరివాహక (ఆర్‌సి) భూముల కోసం పోరాడుతున్న దళితులపై కత్తులు, కర్రలతో పెత్తందారులకు దాడి చేశారు. ఈ దుశ్చర్య బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద మంగళవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు..

కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక గ్రామాల దళితులు సొసైటీగా ఏర్పడి గత ఐదారేళ్లుగా కృష్ణా నదిలో మేటవేసిన భూములను పశువుల మేత కోసం, మరియు సాగు కోసం హక్కు కల్పించాలని అటు అధికారులను, ఇటు ప్రజాప్రతినిధులను పలుమార్లు కోరారు. ఏ ఒక్కరూ స్పందించకపోవటంతో వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో జనవరి ఏడో తేదీ నుంచి ఆ భూమిలోని పిచ్చిమొక్కలను తొలగించేందుకు పూనుకున్నారు. ఆ భూములను తామే ఆక్రమించుకోవాలనే ఆలోచనతోనో, లేక తమ భూముల పక్కనే దళితులు ఎందుకుండాలనే అభిప్రాయంతో పెసర్లంక, పెదలంక, గాజుల్లంక గ్రామాలకు చెందిన అధికార పార్టీ నాయకులు సింగం కృష్ణప్రసాద్, సింగం శ్రీనివాసరావు, వెలివల బసవరత్తయ్య, ఉప్పు కృష్ణారావు, తోట బసవయ్య, కూరేటి శివయ్య, బావిరెడ్డి లోకనాథం, సగ్గున నగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వారి అనుచరులు దాదాపు 200 మంది దళితులపై దాడికి సోమవారం పథకం రచించారు. విషయం తెలిసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం అరవింద వారధి వద్దకు చేరుకున్నారు. పెత్తందార్లను అదుపు చేయకుండా పోలీసులు చేతులెత్తేశారు. తహశీల్దార్‌కు విన్నవించుకోవాలని సూచించి చేతులు దులుపుకున్నారు. దీంతో వారు రెండు ట్రాక్టర్లు, బైకులపై మండల తహశీల్దార్ కార్యాలయానికి బయలుదేరారు. బైకుపై బయలుదేరిన నలుగురు యువకులను అరవింద వారధి వద్ద పెత్తందారులు అడ్డుకొని దాడి చేసి..హత్యాయత్నానికి పాల్పడ్డారు. దాడి విషయం తెలుసుకున్న దళితులు గొడవలు పడటం మంచిది కాదని భావించి బయలుదేరిన ట్రాక్టర్లు నిలిపివేసి.. గాయపడిన వారిని వైద్యశాలకు తరలించారు.


న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన దళితులు

ప్రజాసంఘాల ఖండన

దళితులపై కుల దూషణ, దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం, కెవిపిఎస్ నాయకులు టి.కృష్ణమోహన్, టి.సురేష్, జి.సుధాకర్ ఖండించారు. ఘటనకు బాధ్యులైన అధికార పార్టీకి చెందిన పెత్తందారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి.. దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పోలవరం కేసు విచారణ నుంచి తప్పుకున్న సిజె

ప్రజాశక్తి - అమరావతి

పోలవరం ప్రాజెక్టుపై దాఖలైన కేసు విచారణ నుంచి హైకోర్టు చీఫ్ జస్టిస్ తప్పుకున్నారు. అడ్వొకేట్ జనరల్‌గా చేసినప్పుడు పోలవరం కేసులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయ సలహా ఇచ్చినందున కేసు విచారణ జరపడం భావ్యం కాదని స్పష్టం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించినందున ఏపి పునర్విభజన చట్టం ప్రకారం దాని వ్యయం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపి కేవీపీ రామచంద్రరావు 2017లో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ ఎదుటకు మంగళవారం విచారణకు వచ్చింది. మరో డివిజన్ బెంచ్‌కు ఈ కేసును బదిలీ చేయాలని రిజిస్ట్రీకి సీజే ఆదేశాలు జారీ చేశారు.

2014 ఏప్రిల్ 1వ తేదీ నాటి ప్రాజెక్టు అంచనా వ్యయ్యాన్ని మాత్రమే చెల్లిస్తామని కేంద్రం ప్రకటించడాన్ని పిటిషనర్ సవాల్ చేశారు.

మందుల పరిశ్రమలో పేలిన రియాక్టర్

- కెమిస్టు దుర్మరణం
- నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని జిఎంఎఫ్‌సి (మందుల పరిశ్రమ) ల్యాబ్‌లో మంగళవారం ఉదయం రియాక్టర్ పేలి పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గెడ్డలుప్పికి చెందిన కెమిస్టు చొల్లంగి రామారావు (30) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో నలుగురు కార్మికులు గాయపడ్డారు. రియాక్టర్ పేలి మంటలు వ్యాపించడంతో రామారావు శరీరం పూర్తిగా కాలిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం ఆయన మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కార్మికుల్లో యానాంకు చెందిన కానూరి కృష్ణంరాజును ప్రాథమిక చికిత్స చేసి కంపెనీలో ఉంచారు. జార్ఖండ్‌కు చెందిన ప్రభాకర్ ఝా, భీమవరానికి చెందిన రవివర్మ, విశాఖ నగరంలోని దువ్వాడకు చెందిన వి.సుబ్బరాజులను అనకాపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. రియాక్టర్ పేలిన భవనం ధ్వంసమైంది. మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాద కారణాలపై ఫ్యాక్టరీ తనిఖీ అధికారులు పరిశీలిస్తున్నారని అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ విలేకరు లకు తెలిపారు. ఎలక్ట్రికల్ కండక్టివ్ పైపు బదులు ప్లాస్టిక్ పైపు ద్వారా మిథనాల్‌ను రియార్టర్‌లోకి పంపించడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు ప్రాథమిక విచారణలో గుర్తించినట్టు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. వారంలో విచారణ పూర్తి చేసి ప్రమాదానికి యాజమాన్య లోపాలు రుజువైనట్లయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.


రియాక్టర్ పేలడంతో దెబ్బతిన్న యూనిట్

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు ధర్నా

రామారావు కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం యాజమాన్యం చెల్లించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. కంపెనీ గేట్ ముందు కార్మికులతో కలిసి వారు ధర్నా చేశారు.

బాధితులను పరామర్శ

ప్రమాదంలో గాయపడి అనకాపల్లిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ పరామర్శించారు.

నెల్లూరు వైసిపిలో ప్రకంపనలు!

- ఇద్దరు ఎంఎల్ఎలు టిడిపి గూటికి?
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికార పార్టీ!




ఆనం రామనారాయణరెడ్డి (ఫైల్) కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు వైసిపిలో ప్రకంపనలు సాగుతున్నాయి. జిల్లాలో వెంకటగిరి, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడి శ్రీధర్‌రెడ్డి వైసిపిని వీడడం దాదాపు ఖాయమైంది. నెల రోజుల క్రితమే రామనారాయణరెడ్డిని వైసిపి అధిష్టానం పక్కన పెట్టింది. తాజాగా శ్రీధర్‌రెడ్డిని పక్కన పెట్టేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. దీంతో, ఈ ఇద్దరు నేతలూ టిడిపిలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేస్తోందని వీరు ఆరోపించిన సంగతి తెలిసిందే. భవిష్యత్తు కార్యాచరణకు తమ అనుచరులు, పార్టీ ముఖ్య నాయకులతో చర్చలు జరుపుతున్నారు. రామనారాయణరెడ్డి కొంత కాలంగా వైసిపిపైనా, ప్రభుత్వ కార్యక్రమాలపైనా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 20 రోజుల క్రితం వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి రామనారాయణరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం తప్పించింది. నేదురుమల్లి జనార్ధనరెడ్డి కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించింది. రామనారాయణరెడ్డి సెక్యూరిటీని ప్రభుత్వం కుదించింది. 2 ప్లస్ 2 ఉన్న సెక్యూరిటీని 1 ప్లస్1 గా మార్పు చేసింది. రామనారాయణరెడ్డిని పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించొద్దని ఆ పార్టీ అధిష్టానం ఆదేశాలిచ్చింది. దీంతో, మనస్తాపం చెందిన ఆయన తన అనుచరులతో మంతనాలు చేస్తున్నారు. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, గన్‌మెన్‌లు తగ్గించారని, ప్రభుత్వం రాజ్యాంగేతరంగా పనిచేస్తోందని రామనారాయణరెడ్డి తాజాగా సోమవారం విమర్శలు చేశారు.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొంతకాలంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలపై సున్నిత విమర్శలు చేస్తూ వచ్చారు. ఆయన టిడిపిలో చేరుతారని తొలుత ప్రచారం సాగింది. గత నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పిలిచి మాట్లాడారు. ఆ తర్వాత అంతా సర్దుబాటు జరిగిందని భావించారు. అయితే, తన ఫోనును ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందని శ్రీధర్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఆరోపించారు. వైసిపి అధిష్టానం నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యత నుంచి ఆయనను తప్పించి కొత్త వారిని నియమించడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీంతో, ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో శ్రీధర్‌రెడ్డి తనదారి తాను చూసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిలో భాగంగా రెండు రోజుల నుంచి తన ముఖ్య అనుచరులు, పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. 2024లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి టిడిపి నుంచి పోటీ చేస్తున్నానని, తనకు వైసిపిలో అవమానం జరిగిందని ఈ సందర్భంగా తన అనుయాయులకు ఆయన చెప్పారని సమాచారం. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెంటే ఉన్నామంటూ నాయకులు, కార్యకర్తలు ఆయనకు చెప్పినట్లు తెలిసింది. దీంతో, పార్టీ మారడానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సర్వం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆనం విజయకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలను రంగంలోకి తెచ్చేందుకు వైసిపి ప్రయత్నాలు!

ఈ రెండు నియోజకవర్గాల్లో అదే కుటుంబాల నుంచి ప్రత్నామ్నాయ నాయకత్వాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు వైసిపి అధిష్టానం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఆనం రామనారాయణరెడ్డి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డిని, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని రంగంలోకి తెచ్చే ఆలోచనలో ఉంది. మరోవైపు శ్రీధర్‌రెడ్డితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసిపి జిల్లా ఇన్‌ఛార్జి బాలినేని శ్రీనివాసులు మాట్లాడి సర్దుబాటు చేయడానికి ప్రయత్నాలు చేశారు. అయినా, ఫలితం లేకపోయిందని సమాచారం. దీంతో, శ్రీధర్‌రెడ్డి టిడిపి నేతలతో ముందుగానే ఒప్పందానికి వచ్చి వైసిపిని వీడాలని నిర్ణయం తీసుకున్నారంటూ మీడియాతో మాట్లాడుతూ బాలినేని విమర్శించారు. వైసిపి ఆయనకు అనేక అవకాశాలు కల్పించిందని, ఇప్పుడు పార్టీపై విమర్శలు చేసి వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఒకటి, రెండు రోజుల్లో సిఎంతో మాట్లాడి నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి కొత్త ఇన్‌ఛార్జిని నియమిస్తామని ప్రకటించారు. వెంకటగిరి ఎంఎల్ఎ పార్టీపై విమర్శలు చేస్తున్నారని, అందుకే ఇక్కడ ఇన్‌ఛార్జిని పెట్టామని చెప్పారు. ఎవరి ఫోన్లూ ట్యాపింగ్ చేయలేదని, పార్టీని వీడే ఉద్దేశంతోనూ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వీరిద్దరూ చేస్తున్నారని విమర్శించారు. కాగా, ఇవి చిన్నపాటి సమస్యలని, సర్దుకుంటాయని మంత్రి కాకాణి మీడియాకు తెలిపారు.



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న ఆశాల నేతలు

ఆన్‌లైన్ పనులు చేయించొద్దు

- ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ఆశాల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తమతో ఆన్‌లైన్ పనులు చేయించొద్దని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరులోని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ఆశాలు ధర్నా చేశారు. అనంతరం డిఎంహెచ్‌ఒ ఎం.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ మాట్లాడుతూ..15 ఏళ్లుగా వైద్య, ఆరోగ్య సేవలందిస్తోన్న ఆశాలతో సంబంధంలేని ఆన్‌లైన్ పనులు చేయిస్తూ వేధింపులకు గురి చేయడం తగదని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఆశాలను సచివాలయాలకు అనుసంధానం చేయడం దారుణమన్నారు. నెలలో మూడు రకాల సర్వేల పేరుతో సంవత్సరానికి 30 రికార్డులు రాయిస్తున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ.. సమయంతో నిమిత్తం లేకుండా ఆశాలు రోజంతా కష్టపడుతున్నారని తెలిపారు.. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు పనిచేయకపోయినా సొంత ఫోన్‌లు కొనుగోలు చేసి పనులు చేయాలని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, ఆశా యూనియన్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కొనసాగించాలి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయకున్నా లక్ష్యాలు పూర్తయ్యాయనే నెపంతో కొనుగోళ్లను నిలిపేయడం తగదని ఎపి కౌలు రైతు సంఘం పేర్కొంది. రైతుల వద్దవున్న ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.
ఈ మేరకు మంగళవారం ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వై రాదాకృష్ణ, యం హరిబాబులు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు పండించిన ప్రతి గింజా కొంటామని ఆర్భాటంగా ప్రకటనలు చేసి ఆచరణలో 50 శాతం కూడా కొనుగోళ్లు చేయకపోవడం తగదన్నారు. కొనుగోళ్లు చేసిన చోట రైతులకు 21 రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి.. 40, 50 రోజుల తర్వాతే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో ధాన్యం కొనాలని, సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు.

ఏప్రిల్ 3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేది నుంచి నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పరీక్షల, ఫీజు షెడ్యూల్ మంగళవారం విడుల చేశారు. ఏప్రిల్ 3 వ తేది నుంచి 17వ తేది వరకు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 18 నుంచి 23వ తేది వరకు మధ్యాహ్నం రెండు పూటలలో ఉంటాయని తెలిపారు. పరీక్ష ఫీజును ఫిబ్రవరి 1 నుంచి 15వ తేది వరకు ఎపిఆన్‌లైన్ ద్వారా గానీ, నేరుగా గానీ చెల్లించవ్చునని వివరించారు. ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు అపరాధ రుసుం రూ.25లతో చెల్లించవచ్చునని, రూ.50ల రుసుంతో మార్చి 2వ తేది వరకు చెల్లించవచ్చునని తెలిపారు. ఇంటర్మీడియట్ తత్కాల్ రుసుం రూ.1000లు, పదవ తరగతికి రూ.500గా నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చునని తెలిపారు.

ఆహార కల్తీ ఘటనలో ముగ్గురు సస్పెన్షన్

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)



కందిపప్పును పరిశీలిస్తున్న ఆహార భద్రతా అధికారులు

ఆహార కల్తీ జరిగి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో ముగ్గురు ఉద్యోగులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సి.హెచ్. జయలక్ష్మి, వార్డెన్ జోస్నా, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మిని సస్పెండ్ చేసినట్లు గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ శాంతి విశాల తెలిపారు. ఆహార కల్తీ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మంగళవారం గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. సరుకులు, కోడిగుడ్లు, ఆహారపదార్థాలను పరిశీలించారు. నాసిరకం కందిపప్పు సరఫరా చేసినట్లు, అందులో బఠాని పప్పు కల్తీ, వంటగది పక్కనే టాయిలెట్ ఉండటాన్ని గుర్తించారు. పాఠశాలలో డ్రెయినేజీ నుంచి వస్తున్న దుర్గంధంపై ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. పరీక్షల నిమిత్తం వాటర్, సరుకులు, కోడిగుడ్ల నమూనాలను సేకరించారు. దర్యాప్తు నివేదిక వచ్చిన తరువాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రులు విడదల రజనీ, అంబటి రాంబాబు ఈ సందర్భంగా ప్రకటించారు.

'ఉక్కు' పరిరక్షణపై వైసిపికి చిత్తశుద్ధి ఏదీ?

- ఆ పార్టీ పార్లమెంట్ అజెండాలో కానరాని స్టీల్‌ప్లాంట్ అంశం
- అదానీ విషయంలో వైసిపి, టిడిపిలు వైఖరిని స్పష్టం చేయాలి : వి శ్రీనివాసరావు



ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోన్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై వైసిపికి చిత్తశుద్ధి లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చర్చించబోయే అంశాల్లో ఉక్కు కర్మాగారం ప్రస్తావనే ఆ పార్టీ తేవకపోవడం ఇందుకు తాజా ఉదాహరణని తెలిపారు. గాజువాకలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన ఉక్కు ప్రజా గర్జన విజయవంతమైందని తెలిపారు. ఈ సభలో బిజెపి మినహా అన్ని పార్టీలూ పాల్గొన్నాయన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమాన్ని అగ్రభాగాన ఉండి నడిపిస్తామని ఉక్కు ప్రజాగర్జన సభలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చెప్పారని, అయితే, ఆ పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి అఖిలపక్ష సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశాన్నే ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. దీన్నిబట్టి స్టీల్‌ప్లాంట్‌పై వైసిపి అసలు వైఖరేంటో అర్థమవుతోందని తెలిపారు. వైసిపి సోమవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌ను శ్రీనివాసరావు ప్రదర్శించారు. ఇప్పటికైనా కార్మికులు, నిర్వాసితుల పోరాటాన్ని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గుర్తించి స్టీల్‌ప్లాంట్ విషయంపై పార్లమెంటరీ పార్టీ సమావేశం వేసి, అన్ని పార్టీలనూ కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ వంటి విషయాలూ వైసిపి పార్లమెంట్‌లో చర్చించబోయే అంశాల్లో లేవని శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం గురించి తూతూ మంత్రంగా ప్రస్తావించారన్నారు. గతేడాది వరదల సమయంలో రూ.2 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప, సిఎం జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఇళ్లకు, పంటలకు నష్టపరిహారం నేటికీ ఇవ్వలేదని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదన్నారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ సంస్థ నివేదికను ఆధారంగా చేసుకుని సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో కమిటీ నియమించి సమగ్ర విచారణ జరపాలని, అదానీ విషయంలో వైసిపి, టిడిపిలు తమ వైఖరులు ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు సహా పలు ప్రాజెక్టులను, భూములను అదానీకి అప్పగించారని, వాటన్నింటినీ తాజా ఘటనల నేపథ్యంలో పెండింగ్‌లో పెట్టాలని కోరారు. అదానీకి రుణాలు ఇచ్చిన ఎస్‌బిఐ, ఎల్‌ఐసి దెబ్బతిన్నట్టే రానున్న కాలంలో జాగ్రత్త వహించకపోతే రాష్ట్ర ప్రభుత్వమూ మునిగిపోతుందని తెలిపారు. ప్రజలపై భారాలు పడతాయన్నారు. ఈ నేపథ్యంలో అదానీకి రాష్ట్రంలోని కేటాయింపులపై న్యాయవిచారణ జరపాలని, అప్పటి వరకూ కేటాయింపులు ఆపేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పాల్గొన్నారు.

13న ఇపిఎఫ్ కార్యాలయాల వద్ద ధర్నాలు

- ఎపిఆర్‌పిఎ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 13న ఇపిఎఫ్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వెల్లడించింది. కనీస పెన్షన్ రూ.9 వేలు మంజూరు చేయాలని, సీనియర్ సిటిజన్‌లకు రాయితీలు కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. అసోసియేషన్ సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును ఇపిఎఫ్ పెన్షనర్లకు వర్తింపజేయడంలో అధికారులు అనేక ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. హయ్యర్ వేతనం పొందుతున్న ఇపిఎఫ్ ఉద్యోగులకు హయ్యర్ ఆప్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి సుధాకరరావు మాట్లాడుతూ సుప్రీంతీర్పు ప్రకారం 2014 సెప్టెంబర్ 1 నుంచి రిటైర్డ్ అయిన వారికి, ఉద్యోగంలో కొనసాగుతున్న వారికి హయ్యర్ ఆప్షన్ ఇచ్చే సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు శాస్త్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు గంగాధరరావు, ఆదినారాయణ, కెపి కుమార్, సత్యరాజు, వి శ్రీరామమూర్తి, శేషయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సాధించలేనిదేది లేదు

- గుంటూరులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన నిక్‌వుజనిక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న నిక్‌వుజనిక్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులు నిక్ వుజనిక్ మంగళవారం గుంటూరులోని స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ఇంగ్లీష్ పాఠ్యపుస్తకంలో మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో నిక్ వుజనిక్ జీవితగాథను పలువురు విద్యార్థినులు ఆయనకు చూపించి, దీనితో మేము ఎంతో ప్రేరణ చెందామని తెలిపారు. ఎటువంటి వ్యక్తిత్వం ఉన్న వారిని ఇష్టపడతారు? 'లవ్ విత్ అవుట్ లిమిట్స్' పుస్తకం రచించటానికి కారణం? ఆ పుస్తకం థీమ్? మీకు ప్రేరణ ఇచ్చిన వ్యక్తులు ఎవ్వరని నిక్‌వుజనిక్‌ను పలువురు విద్యార్థినులు ప్రశ్నించారు. నిక్ వుజనిక్ మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకంలో తన జీవితగాథకు చోటు కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యలో అందరికీ సమానంగా అవకాశాలు కల్పించడంపై అభినందనలు తెలిపారు. జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, మనం ఏదైతే కష్టమని భావించి భయపడి వెనుకడుగు వేస్తామో, అదే మనల్ని విజయ శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. నా జీవితంలోని ప్రేమ కథని, నేను నిజమైన ప్రేమను ఏ విధంగా గుర్తించానో తెలియచెప్పడమే లవ్ విత్ అవుట్ లిమిట్స్ పుస్తకం ప్రధాన థీమ్ అని అన్నారు. ఫ్లోరిడాలో ఫిల్టాప్ అనే వ్యక్తి నడవలేని, మాట్లాడలేని స్థితిలో ఉండి కూడా లేజర్ కిరణాలతో వెబ్ పోర్టల్‌ను నిర్వహిస్తూ 300 మందిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి నిక్ వుజనిక్‌ను సన్మానించి, డ్రాయింగ్ ఉపాధ్యాయిని చిత్రీకరించిన నిక్ వుజనిక్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహదారు (నవరత్నాలు) ఆర్.ధనుంజయరెడ్డి, ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పాల్గొన్నారు.

చర్చకు నేను సిద్ధం

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)



రైతును అడిగి సమస్యను తెలుసుకుంటున్న లోకేష్

'మంత్రులు వేణు, నారాయణస్వామి వస్తే బిసి, ఎస్‌సిలకు వైసిపి ప్రభుత్వంలో చేసిన మోసంపై చర్చకు నేను సిద్ధమ'ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సవాల్ విసిరారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోకి ప్రవేశించింది. కైగల్ గ్రామంలో రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరటి రైతులతో ముచ్చటించారు. 'ఎకరా అరటి సాగుకు రూ. మూడున్నర లక్షల పెట్టుబడి అవుతుంది. ఎరువులు, కూలీలు, విత్తనం ధర భారీగా పెరిగింది. ఎకరం పంట అమ్మితే రూ.లక్షన్నర మాత్రమే వచ్చింది. సుమారుగా రూ.రెండు లక్షలు నష్టపోయాం. పెట్టుబడి ఖర్చు తగ్గి, మంచి రేటు వస్తే తప్ప అరటి రైతులు కోలుకునే పరిస్థితి లేదని' రైతులు తెలిపారు. లోకేష్ స్పందిస్తూ... 'మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా పోరాడతాను. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అరటి రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరిస్తామని' హామీనిచ్చారు. అనంతరం రాయల్‌మహల్‌లో బిసి తరగతులతో సమావేశమయ్యారు. కులవృత్తులు చేసుకునేవారికి వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి ప్రోత్సాహమూ లేదని విమర్శించారు. కార్పొరేషన్ చైర్మన్లకు కనీసం కుర్చీలు కూడా లేవన్నారు. 56 కార్పొరేషన్లు ఉన్నాయని, ఒక్కరికైనా ఒక్క లోన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. 26 మంది బిసిలను జగన్ పాలనలో హత్య చేశారని ఆరోపించారు. జగన్‌ప్యాలెస్ లోపల సజ్జల, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఉంటే ప్యాలెస్ బయట బిసిలు ఉన్నారని పేర్కొన్నారు. 12 యూనివర్సిటీలు ఉంటే 10 యూనివర్సిటీల్లో సిఎం సొంత సామాజిక తరగతికి చెందిన వారే ఉన్నారన్నారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు కిషోర్‌గౌడ్, సుబ్రమణ్యంశెట్టి, రాజన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కైగల్ నుంచి ఎల్లూరు గ్రామం వరకు యాత్ర సాగింది. బుధవారం ఎల్లూరు నుంచి పలమనేరు మండలంలోకి యాత్ర ప్రవేశించనుంది.


'ఉక్కు'పై రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ఉక్కు ప్రజా గర్జన సభ వేదికపై చెప్పిన మాటలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోరింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 719వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఇఎస్, సేఫ్టీ, టెక్, సెల్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్ అయోధ్యరామ్, నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్ మాట్లాడారు. ఉక్కు ప్రజా గర్జన సభను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాన్ని వైసిపి పార్లమెంట్ అంశాల అజెండాలో పెట్టాలని కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో విశాఖ ఉక్కుపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణ విషయమై దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకూ, ఉభయ సభల్లో ఉన్న పార్లమెంట్ సభ్యులకూ మరోమారు పోరాట కమిటీ తరుపున విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. పోరాటానికి మరింత పదును పెట్టేందుకు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. దీక్షల్లో నాయకులు వి.అప్పారావు ఆర్.రామారావు, వి.వెంకటేష్, కె.శ్రీనివాసరావు, ఎంఆర్‌కె.ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.



భీమవరం సభలో అభివాదం చేస్తున్న నేతలు

విద్యార్థులు, యువతతోనే హోదా సాధ్యం

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో సాగిన సమరయాత్ర 2.0

ప్రజాశక్తి - ఏలూరు టౌన్/భీమవరం

'పార్లమెంటులో చట్టం చేశారు.. తిరుపతి వెంకన్న సాక్షిగా హామీలు గుప్పించారు.. ఎనిమిదిన్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఏఒక్క హామీ అమలు చేయలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే మరో స్వాతంత్రోద్యమానికి సన్నద్ధమవుతాం' అని విద్యార్థి యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి హెచ్చరించాయి. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0' మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాగింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కె.నాని అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... వామపక్ష పార్టీలు మినహా మిగిలిన ఏ ఒక్క పార్టీ కూడా ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అఖిలపక్షం నిర్వహించి, కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. ఈ యాత్రకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా పూర్తి సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ నిత్యావసర ధరల రూపంలో ప్రజలపై పెనుభారాలు మోపుతోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. హోదా తీసుకొస్తామని ఎన్నికల ముందు చెప్పిన వైసిపి నేడు ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, సామాజిక ఉద్యమకారిణి మనోహరమ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బాలికల కో-కన్వీనర్ సిహెచ్.పావని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు పాల్గొన్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి యాత్ర చేరుకుంది.

పాడి రైతులను ఆదుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సదస్సు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాడి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం సదస్సు డిమాండ్ చేసింది. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సదస్సుకు కర్ణాటక డెయిరీ ఫార్మర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ పిఆర్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో రైతుల ఉద్యమం ఫలితంగా లీటర్‌కు రూ.5 చొప్పున బోనస్ ఇస్తున్నారని తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ దాణా, మేత, గేదె, ఆవు ధరలు పెరగడంతో వాటికి పెట్టిన పెట్టుబడి రాక రాష్ట్రంలో పాలరైతులు నష్టాన్ని చూడాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాల సేకరణ ధరకు అదనంగా వాగ్దానం చేసిన లీటర్‌కు రూ.4 ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థకు మాత్రమే పాలు ఇవ్వాలనడం సరైంది కాదన్నారు. ప్రతి రైతులకు లీటరుకు రూ.10ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ సహకార రంగంలోనే డెయిరీ కొనసాగుతూ పాల రైతులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. సంఘం సభ్యులు బి రాంబాబు, జి రాజారామిరెడ్డి, భారతి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో కౌలురైతు సంఘం కార్యదర్శి ఎం హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక




బుద్ధరాజు రాంబాబు, కంచుమాటి అజయ్

సదస్సు అనంతరం ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం నూతన కమిటీ ఎన్నికయింది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బుద్ధరాజు రాంబాబు, కంచుమాటి అజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా వి కృష్ణయ్య, జి రాజారామిరెడ్డి, వల్లూరి భారతి, జి నాయనబాబు, వి శ్రీనివాసరెడ్డి, వి ధనలక్ష్మీ, సిహెచ్ లక్ష్మీ, కె స్రవంతి, కె రామారావు, వి తబిత, వి సునీత, ఎం శివకుమారి, భాస్కరావులను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో పాడి రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని తీర్మానం చేశారు.

రాష్ట్రంలో పాదరక్షల తయారీ కేంద్రాలు

- మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తోలు పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్(లిడ్‌క్యాప్) ద్వారా రాష్ట్రంలో రెండు చోట్ల పాదరక్షల తయారీ కేంద్రాలను నిర్మిస్తామని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. రూ.11.50కోట్లతో వీటి నిర్మాణం చేపటనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సి కార్పొరేషన్ ఆర్థిక సాయంతో అమలు చేస్తున్న పథకాలపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు.

పటిష్టమైన ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

ఎయులో సౌత్ జోన్ విసిల సదస్సులో గవర్నర్ విశ్వభూషణ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పటిష్టమైన ఉన్నత విద్యా వ్యవస్థతోనే దేశ అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సౌజన్యంతో ఎయు నిర్వహిస్తోన్న 'సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ మీట్ 2023 - రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించి వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉపకులపతులను ఉద్దేశించి మాట్లాడారు. దేశాభివృద్ధికి ఉన్నత విద్య ఎంతో ప్రధానమైన అంశమని తెలిపారు. నవ్య భారతావని నిర్మాతలను తీర్చిదిద్దే బాధ్యతను విశ్వవిద్యాలయాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. పరిశోధనా రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు నిలవాలని ఆకాంక్షించారు. నాలెడ్జ్ సూపర్ పవర్ లీడర్‌గా నేడు భారత్ నిలుస్తోందని తెలిపారు. విద్యా రంగం వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, మెరుగైన వైద్య సేవలు దేశంలో పెరుగుతున్నాయని అన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగి ఉందని నాస్కామ్ స్పష్టం చేసిందని తెలిపారు. 2022 నాటికి దేశంలో 80 వేలకుపైగా స్టార్టప్ సంస్థలు ఉన్నాయన్నారు. అనంతరం ఎఐయు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎయులోని డాక్టర్ వివిఎస్.కృష్ణ గ్రంథాలయంలో దశాబ్దాల కాలం నుంచీ ఉన్న 2.5 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేయగా వాటిని గవర్నర్ బటన్ నొక్కి అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఎఐయు సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు కె.రామ్మోహనరావు, ఎయు విసి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



సౌత్ జోన్ విసిల సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతుల సమస్యలను పరిష్కరించాలి
- సిఎంకు టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, దీనిని ఆదుకోవాలని టిడిపి వ్యవసాయ స్టీరింగ్ కమిటీ కోరింది. కమిటీ సమావేశం టిడిపి కార్యాలయంలో మంగళవారం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సభ్యులు లేఖ రాశారు. అన్నదాతల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. ధాన్యం బకాయిల చెల్లింపుల్లో నెలల తరబడి జాప్యం ఎందుకు జరుగుతోందని పేర్కొన్నారు. ఇ-క్రాప్ నమోదు పేరుతో కౌలు రైతులు మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోకుండా దగా చేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో నాలుగేళ్లలో రైతులు రూ.60వేల కోట్లు నష్టపోయారని పేర్కొన్నారు. సబ్సిడీపై మైక్రో న్యూట్రియంట్స్ అయిన జిప్సం, బోరాన్, జింక్ పంపిణీ నిలిపివేయడంతో రైతులకు పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గిందని తెలిపారు. ఈ కమిటీలో మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, టిడిపి శాసనసభా ఉపపక్షనేత నిమ్మల రామానాయుడు, టిడిపి రైతు విభాగం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా లాభాల్లో 70% వృద్ధి

కోల్‌కత్తా : ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 70 శాతం వృద్ధితో రూ.7,755.55 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.4,558.39 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో కంపెనీ ఉత్పత్తి పెరగడంతో పాటు డిమాండ్, అధిక అమ్మకాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయి. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ రూ.35,169 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.28,433 కోట్లుగా చోటు చేసుకుంది.

కార్డుదారులకూ ఎఫ్ఆర్ఎస్
కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పొందే లబ్ధిదారులకు కూడా ఫేషియల్ ఆధారిత విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నారు. ఈ మేరకు కసరత్తు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటివరకు వేలిముద్రల ద్వారా సరుకులను పంపిణీ చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన ఒక సమావేశంలో ఈ విషయంపై చర్చ జరిగినట్లు తెలిసింది. అధికారులుకూడా ఎఫ్ఆర్ఎస్‌వైపే మొగ్గు చూపించినట్లు సమాచారం.

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయడం వల్ల లాభ నష్టాలపైనా చర్చ జరుగుతోంది. ఈ విధానం అమలులోకి వస్తే నకిలీ లబ్ధిదారులను నివారించవచ్చునని అధికారులు అంటున్నారు. ఇదే సమయంలో సాంకేతిక సమస్యలు ఇబ్బందికరంగా మారుతాయని వారంటున్నారు. గ్రామాల్లో సరైన నెట్‌వర్క్ అందుబాటులో లేని కారణంగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా సరుకుల పంపిణీ సజావుగా సాగే పరిస్థితి ఉండదన్న భావాన్ని కొంతమంది అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ శాఖల్లో అమలు చేస్తున్న ఈ విధానంలో లోపాలు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. సాంకేతిక సమస్యలు కారణంగా హాజరు కూడా సక్రమంగా నమోదు కావడం లేదు. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలోనే చౌకధరల దుకాణాల్లో కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయడం ఎంత వరకు విజయవంతం అవుతుందన్నది వేచిచూడాలి.

కోర్టులో లొంగిపోయిన ఒవెరా గ్రూప్ యజమాని

గాంధీనగర్ : గుజరాత్ మోర్బీ బ్రిడ్జి కూలి 135 మందికిపైగా మరణించిన కేసులో ప్రధాన నిందితుడు, ఒవెరా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జయ్‌సుఖ్ పటేల్ మంగళవారం స్థానిక కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులో జయ్‌సుఖ్ పటేల్‌ను ప్రధాన నిందితుడిగా 1,262 పేజీల చార్జిషీటులో పోలీసులు పేర్కొన్నారు.

దీంతో గతవారం నిందితునిపై అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయింది. బ్రిడ్జి ఘటన అనంతరం నిందితుడు పరారీలో ఉన్నాడని, అరెస్ట్ నుండి తప్పించుకునేందుకు బెయిల్‌కోసం కోర్టుని ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన 10వ నిందితుడు జయ్‌సుఖ్ పటేల్. గతంలో అరెస్టయిన వారిలో సబ్ కాంట్రాక్టర్లు, టికెట్ క్లర్కులుగా పనిచేసిన రోజువారీ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. బ్రిటీష్ కాలం నాటి మోర్బీ వంతెన మరమ్మతు, నిర్వహణ కాంట్రాక్టును అజంతా బ్రాండ్‌తో గోడ గడియారాలు తయారీ చేసే కంపెనీ ఒవెరా గ్రూప్‌కు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కట్టబెట్టిన సంగతి తెలిసిందే.

సిబిఐ దర్యాప్తుతోనే సిఎం ఢిల్లీ పర్యటన

'యువగళం'కు సొంతంగా బందోబస్తు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అవినాష్‌రెడ్డిపై సిబిఐ దర్యాప్తుతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ యాత్ర చేపట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నారాసుర రక్త చరిత్ర అని నాడు చెప్పిన ముఖ్యమంత్రి నేడు వెలుగు చూస్తోన్న వాస్తవాలపై ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. మాయమాటలు, తప్పుడు హామీలు, కోడికత్తి సానుభూతితో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సైకో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఏటా జాబ్ కేలండర్ అని హామీ ఇచ్చి విస్మరించారన్నారు.

కేంద్ర నిధులపై 23 ప్రశ్నలు

రాష్ట్రాలకు కాగ్ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు, వాటి వినియోగం తీరుపై కాగ్ రాష్ట్రాలను 23 ప్రశ్నలు వేసింది. సాధ్యమైనంత త్వరగా వాటికి జవాబులు పంపాలని కోరింది. కేంద్రం అమలు చేస్తున్న అన్ని పథకాలకు సింగిల్ నోడల్ ఏజెన్సీ ఏర్పాటుచేశారా అని ప్రశ్నించింది. ఆ ఖాతాలను ఐఎఫ్ఎంఎస్‌లకు అనుసంధానం చేశారా, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధాన పద్దులకు ఈ ఖాతాలను మ్యాపింగ్ చేశారా లేదా అన్నది చెప్పాలని కాగ్ కోరింది. ఈ నిధులకు కేంద్రం తరహాలోనే రాష్ట్రంలో కూడా ప్రత్యేకంగా బడ్జెట్ తయారుచేస్తున్నారా, ఆ నిధులను వినియోగించేందుకు ఏ పద్ధతిని ఉపయోగిస్తున్నారో చెప్పాలని కోరారు. ఓచర్ బిల్లు, కంటింజెంట్ బిల్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వంటి విధానాల్లో దేనిని అనుసరిస్తున్నారో చెప్పాలని సూచించారు.కేంద్ర పథకాలకు రాష్ట్రం ఇవ్వాల్సిన వాటా నిధులపైనా ప్రశ్నావళిలో ఆరా తీశారు. ఎంత నిధులు ఇచ్చారు, ఆ వివరాలను పిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం చేశారా అన్నది స్పష్టం చేయాలని పేర్కొన్నారు. ఈ నిధులను నేరుగా ఎస్ఎన్ఏ ఖాతాకు ఇస్తున్నారా, లేక పనుల నిర్వహణ సంస్థకు ఇస్తున్నారా అన్నది కూడా చెప్పాలని అడిగారు. ఎస్ఎన్ఏ కోసం ఏ బ్యాంకుల్లో ఖాతాలు నిర్వహిస్తున్నారు, నిర్వహణ సంస్థలు ఆ నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారన్నది కూడా సేకరిస్తున్నారు. నిధుల వ్యయంలో నిర్వహణ సంస్థలకు పరిమితి ఉందా అన్నది కూడా తెలుసుకుంటున్నారు.

వడ్డీ మాటేమిటి

పలు పథకాలకు కేంద్రం ఇస్తున్న నిధులను సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాల్లో జమచేసిన తరువాత వాటిపై వస్తున్న వడ్డీ వివరాలు కూడా చెప్పాలని కాగ్ పేర్కొంది. ఇలా వచ్చిన వడ్డీ నిధులను తిరిగి కేంద్రానికి చెల్లిస్తున్నారా అన్నది కూడా ప్రశ్నావళిలో ఒక కీలక అంశంగా పొందుపరిచారు. ఎస్ఎన్ఏలో ఉన్న నిధుల వివరాలను నేరుగా ఎజి కార్యాలయం పరిశీలించే వెసులుబాటుపైనా ఆరా తీసింది. 2022 మార్చి వరకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలు, అందులో ఎస్ఎన్ఏకు బదలాయించని నిధులపైనా వివరాలు చెప్పాలని నిర్దేశించింది. బ్యాంకుల్లో ఉండీ ఇంకా ఖర్చు కాని నిధులను తిరిగి కేంద్రానికి పంపారా, లేక వచ్చే ఏడాది పథకాలకు మళ్లించారా అన్నదానిపైనా స్పష్టత ఇవ్వాలని కాగ్ కోరింది.

బదిలీలకు అవకాశం కల్పించండి

- సిఎంకు ఎపిజిడబ్ల్యుఎస్‌యుఎస్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఐచ్ఛిక బదిలీలు, సాధారణ బదిలీలకు అవకాశం కల్పించాలని, ఎపి గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య (ఎపిజిడబ్ల్యుఎస్‌యుఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సిఎం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. స్థానికత రీత్యా అనేక మంది మహిళా ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. వార్డు,గ్రామ సచివాలయాలశాఖ ప్రజలకు సేవాదృక్పథంతో కాకుండా టార్గెట్ ఓరియంటెడ్‌గా మారుస్తున్నారని, ఫలితంగా ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను 9 నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లేర్ చేశారని, ఆ కాలాన్ని పరిగణలోకి తీసుకుని సీనియారిటీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఏ శాఖ ఉద్యోగికి లేని విధంగా సచివాలయ ఉద్యోగులకు "కీప్ గోయింగ్ పారా మీటర్స్"తో లింక్ చేసి ఫర్మారెన్స్ ఆధారంగా వేతనాలు చెల్లించే పద్ధతి సరియైంది కాదని సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు కె.అనూరాధ పేర్కొన్నారు. విఆర్‌ఓలకు పే స్కేలు అమలు చేయాలని, విఆర్‌ఓ. సర్వేయర్ల క్యాడర్లకు ఇచ్చినట్లుగా ఫీల్డ్ జాబ్‌లో ఉండే హెల్త్ సెక్రటరీలకు కూడా బయోమెట్రిక్ నుంచి మినహాయింపునివ్వాలని, చెత్తపన్ను తదితర యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా కాకుండా ఇంటిపన్నుతో పాటు కలిపి మునిసిపల్‌శాఖ వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎపి గ్రామ , వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

అసైన్డ్, సీలింగ్ భూములను పంపిణీ చేయాలి

- పేదల ధర్నా

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను తమకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడులోని వివాదాస్పద చేపల చెరువుల వద్ద పేదలు మంగళవారం ధర్నా చేశారు. పేదల భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ.. పేదలకు చెందిన భూములను అక్రమంగా అనుభవిస్తోన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ పేదలకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. దోసపాడులో గత ఎనిమిది నెలలుగా గ్రామానికి చెందిన దళితులు, పేదలు తమ భూములు తమకే ఇవ్వాలని కోరుతూ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్థానిక తహశీల్దార్ అవినీతికి పాల్పడుతూ పేదలకు భూములను పంపిణీ చేయకుండా భూస్వాములకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. సర్వే చేస్తామని ఎనిమిది నెలల క్రితం చెప్పి నేటికీ చేయకపోవడం శోచనీయమన్నారు.

దళితుల అసైన్డ్ భూములను విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్, తదితరులు బలవంతంగా ఆక్రమించి దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. లోకాయుక్త ఆదేశాలను సైతం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. దళితులు,పేదల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనందరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



వివాదాస్పద చేపల చెరువుల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న దళితులు

ఇ-లాటరీ ద్వారా 22 ప్లాట్ల కేటాయింపు : సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాడేపల్లి - మంగళగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఫేజ్-2 లే-అవుట్‌కు సంబంధించిన మంగళవారం నిర్వహిం చిన ఇ-లాటరీ ద్వారా అర్హులైనవారికి 22 ప్లాట్లు కేటాయించారు. ఈ మేరకు ఎపి సిఆర్‌డిఎ కమిషనరు వివేక్ యాదవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 240 గజాల కేటగిరిలో 11 ప్లాట్లు, 200 గజాల కేటగిరిలో 11 ప్లాట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎంఐజి లేఅవుట్‌లో తొలి విడతలో గతేడాది జూన్ 25న 102 మందికి, అదే ఏడాది జులై 5న మరో 17 మందికి ఆన్‌లైన్ రాండమ్ లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు ధృవీకరణ పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఇ-లాటరీ నిర్వహణ కార్యక్రమంలో సంస్థ అదనపు కమిషనరు షేక్ అలీంబాషా, ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ వి. డేవిడ్‌రాజు, తహసీల్దార్ కె.నాగలక్ష్మీ, ఐటి ప్రాజెక్టు మేనేజరు ఎం.లక్ష్మీ ప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

95కి చేరిన పెషావర్ ఆత్మాహుతి దాడి మృతులు

పెషావర్ : స్థానిక మసీదులో సోమవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో మృతుల సంఖ్య 95కి చేరింది. మరో 150 మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. రాత్రి నుండి ఇప్పటివరకు శిథిలాల నుండి తొమ్మిది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఇంకా శిథిలాలను తొలగించాల్సివుందని, శిథిలాల కింద చిక్కుకున్న వారు సజీవంగా ఉండే అవకాశాలు లేవని ఓ అధికారి తెలిపారు. సహాయక చర్యలు చేపడుతోన్న అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పెషావర్ ఆసుపత్రి అధికార ప్రతినిధి తెలిపారు. పెషావర్‌లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే పోలీస్ లైన్స్‌లోని ఓ మసీదులో సోమ వారం మధ్యాహ్నం ఆత్మాహుతి దాడి జరిగిన సంగతి తెలిసిందే. మరణించిన వారిలో ఎక్కువమంది భద్రతా బలగాలు, పోలీసు అధికారులే ఉన్నారు.

'చాట్‌బాట్'తో ఐదు వేల సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఏర్పాటు చేసిన చాట్‌బాట్ ద్వారా ఐదు వేల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటిని యజమానులకు అందించినట్లు ఎస్‌పి డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాట్‌బాట్ సేవలు ప్రారంభించిన తక్కువ కాలంలోనే దొంగతనానికి గురైన రూ.8.25 కోట్లు విలువజేసే 5,077 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాటిని కనుగొనేలా చాట్‌బాట్‌ను ప్రారంభించామన్నారు.

మట్టి రాతి నాణ్యత పరిశీలన

- పోలవరానికి కేంద్ర బృందం

ప్రజాశక్తి - పోలవరం

మట్టి రాతి నాణ్యతను పరిశీలించేందుకు కేంద్ర బృందం మంగళవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. పోలవరానికి చేరుకున్న బృందం (సిఎస్ఎంఆర్ఎస్) తొలుత గత వరదలకు దెబ్బతిన్న దిగువ కాపర్ డ్యామ్ ప్రాంతానికి చేరుకుంది. ఇరువైపులా పలుచోట్ల రాతి నమూనాలను సేకరించి, పరీక్షలు నిర్వహించింది. ఈ బృందం ఫిబ్రవరి మూడో తేదీ వరకు ప్రాజెక్టులోని గ్యాప్-1, 2, 3ల్లో నిర్మించిన కాంక్రీట్ గోడలను, స్పిల్‌వే అప్రోచ్ ఛానల్, పైలెట్ ఛానల్‌లో రాతి నాణ్యతను పరిశీలించనుంది.ఒకటిన్నర మీటర్ల వ్యాసార్థం కలిగిన రింగ్ పరిధిలో 0.8 మీటర్ల దిగువున రాతి నాణ్యతను తూకం నిర్వహించి సామర్థ్యాన్ని అంచనా వేస్తారని బృందం సభ్యులు తెలిపారు. ఈ బృందంలో సిఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్త ఉదయ్‌భాను చక్రవర్తి, ల్యాబ్ అసిస్టెంట్ రాజేశ్వర్‌సింగ్, మరో ఇద్దరు సభ్యులు ఉన్నారు.



శాంపిళ్లు సేకరించి పరీక్షలు చేస్తున్న బృందం

అదానీ సొంత ఉద్యోగుల అనాసక్తి

ఎఫ్‌పిఒకు దూరం

ముంబయి : అదానీ కంపెనీ షేర్లపై ఆ సంస్థ ఉద్యోగులే అనాసక్తిని వ్యక్తం చేశారు. ఇందుకు నిదర్శనం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ)ల్లో పెట్టుబడులకు వారు దూరంగా ఉండటమే. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇందులో పెట్టుబడులకు రిటైల్ ఇన్వెస్టర్లు, ఆ కంపెనీ ఉద్యోగులు ఆచితూచి వ్యవహరించారు. జనవరి 31తో ముగిసిన ఈ ఇష్యూలో రిటైల్ ఇన్వెస్టర్లు, ఉద్యోగుల కోసం 2.29 కోట్ల షేర్లను కేటాయించగా.. 11 శాతం మాత్రమే సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. ఉద్యోగులు తమకు కేటాయించిన 1.6 లక్షల షేర్ల లో 52 శాతం షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలు అయ్యాయి. ఈ ఎఫ్‌పిఒతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా.. 4.55 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 4.62 కోట్లకు బిడ్లు దాఖ లయ్యాయి. నాన్ ఇన్స్‌ట్యూట్ ఇన్వెస్టర్లు, క్వాలిఫైడ్ ఇన్స్ ట్యూషనల్ బయ్యర్స్ విభాగంలో ఎక్కువగా దరఖాస్తులు రావడంతో పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది.

అదానీ గ్రూపు కంపెనీలు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు గౌతం అదానీ ఊహించని నష్టాలు చవి చూస్తున్న విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్లలో వరుస భారీ నష్టాలతో అదానీ టాప్ -10 కుబేరుల జాబితాలో చోటు కోల్పోయారు. దీంతో ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానం నుంచి ఏకంగా 11వ స్థానానికి దిగజారారని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ మంగళవారం ఓ రిపోర్టులో తెలిపింది. 2022లో అదానీ అత్యధికంగా రూ.3.2 లక్షల కోట్ల సంపదను కూడబెట్టుకున్నారు. లక్షల కోట్ల సంపద కోల్పోయినప్పటికీ.. ఇప్పటికీ అదానీ భారత ధనవంతుల్లో ఒక్కటో స్థానంలో ఉన్నారు. ముకేష్ అంబానీ రూ.6.7 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. ప్రపంచ కుబేరులతో పోల్చితే రిలయన్స్ అధినేత 13వ స్థానంలో ఉన్నారు. "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీ లాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. మూడేళ్ల క్రితం అదానీ సంపద రూ.1.62 లక్షల కోట్లుగా ఉండగా.. ఇటీవల రూ.10 లక్షల కోట్ల చేరువకు వెళ్లింది. జాతీయవాదం పేరుతో దేశాన్ని క్రమపద్ధతిలో దోచుకుంటుంది." అని హిండెన్‌బర్గ్ రిపోర్ట్ చేసిన విషయం తెలిసిందే.


సంపాదకీయం

ఉక్కు సంకల్పం...

బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కార్పొరేట్ల పాలు కానివ్వకూడదన్న దృఢ సంకల్పంతో కార్మికవర్గం రెండేళ్లుగా పోరాటాన్ని కొనసాగించడం శ్లాఘనీయం. 'ఎవ్వడురా అమ్మేది... ఎవ్వడురా కొనేది...' 'విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు... కేంద్రం సొత్తు కాదు...' అంటూ విశాఖ కేంద్రంగా సాగుతున్న నినాదాల మోత రాష్ట్రవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తూ... కేంద్రంలోని మోడీ సర్కారును నిలేస్తోంది. ప్రభుత్వ రంగాన్ని గంపగుత్తగా కార్పొరేట్లకు కట్టబెట్టడమో... మూసివేయడమో విధానంగా సాగుతున్న మోడీ సర్కారు ఏలుబడిలో ఒక ప్రభుత్వ రంగ సంస్థను అమ్మనివ్వబోమంటూ ఇంతకాలం పాటు సాగిన పోరాటంగా విశాఖ ఉక్కు ఇప్పటికే ప్రత్యేక చరిత్రను లిఖించింది. విశాఖ ఉక్కు పరిశ్రమ వస్తే ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయని, తమ బతుకులు బాగుపడతాయన్న సంకల్పంతో సాగిన పోరాటంలో... 1966లో 32 మంది ప్రాణత్యాగం చేశారు. 16 వేల మంది నిర్వాసితులు 22 వేల ఎకరాలను అతి చౌకగా కర్మాగారానికి ఇచ్చారు. ఎట్టకేలకు 1990లో ప్రారంభమైన పరిశ్రమ 2021-22 నాటికి వార్షిక టర్నోవర్ రూ.20 వేల కోట్లు, ఆ ఏడాది నికర లాభం రూ.945 కోట్లు సాధించింది. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న విపత్కర సమయంలో ఆక్సిజన్ సరఫరా చేసి, 'ఉక్కు కాదు.. ఊపిరి' అని నిరూపించుకుంది.

ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రగతిపథంలో పరిశ్రమను నడిపిన చరిత్ర, అనుభవం ఇక్కడి కార్మిక వర్గానికి, ఉద్యమ శక్తులకు ఉంది. దేశంలోని అన్ని ప్రభుత్వరంగ, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నా... అవి లేని ఏకైక పరిశ్రమ ఇది ఒక్కటే. అందువల్ల ఏటా సుమారు రెండు వేల కోట్లు అదనంగా విశాఖ స్టీల్ ఖర్చు చేయాల్సి వస్తోంది. విశాఖ ఉక్కుకు తక్షణమే సొంత ఇనుప గనిని మంజూరు చేయాలి. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు పన్నులు, డివిడెండ్ల పేరుతో ఈ పరిశ్రమ చెల్లించింది. ప్రభుత్వరంగంలో నడిస్తే కార్పొరేట్ సంస్థలకు భిన్నంగా... భవిష్యత్తులోనూ మరిన్ని వేలు, లక్షల కోట్ల రూపాయలు చెల్లించే అవకాశముంది. అప్పులు ఎగ్గొట్టిన బడా పెట్టుబడిదారులకు రూ.10 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన కేంద్రం స్టీల్‌ప్లాంట్‌కున్న రుణాలు సుమారు రూ.30 వేల కోట్లను వెంటనే రద్దుచేయాలి. ప్రైవేటు పరిశ్రమల లాభాల కోసం విశాఖ ఉక్కును సామర్థ్యం మేరకు నడపకుండా అడ్డంపడే విధానాలకు కేంద్రం స్వస్తి చెప్పాలి. ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అమ్మాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికైనా వెనక్కితీసుకోవాలి. విశాఖ ఉక్కుపై కేంద్రానికి ఎలాంటి హక్కు లేదని, ఉద్యమానికి రాష్ట్రప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని సిఎం మాటగా చెబుతున్నానని సోమవారం జరిగిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రి ప్రకటించారు. అయితే, అది ఆచరణ రూపం దాల్చాలి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ఎంపిలందరిని కూడగట్టి, బిజెపియేతర పార్టీల సహకారం కూడా తీసుకొని 'ఉక్కు'పై కేంద్రం వైఖరి వెనక్కి తీసుకునేలా ఒత్తిడి నిర్మించాలి. అందుకు చొరవ తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వము, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనే! వామపక్ష పార్టీలు అన్ని దశల్లోనూ ఈ పోరాటంలో ముందుంటున్నాయి. తెలుగుదేశం కూడా ఉద్యమంలో భాగస్వామి కావాలి. అందరూ ఏకమై కేంద్రం మెడలు వంచాలి. ప్రజా పోరాటాలతో ప్లాంట్‌ను సాధించినట్లుగానే... ప్రైవేటీకరణపై అంతిమ విజయాన్ని సాధించాలి. పోస్కోకు, ఎల్ఐసి, బ్యాంకుల సొమ్ము కొల్లగొట్టి దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్న అదానీకి ప్లాంట్‌తోపాటు లక్షల కోట్ల రూపాయల విలువైన 22 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను కట్టబెట్టాలని చూస్తున్న మోడీ సర్కారు యత్నాలను తిప్పికొట్టాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవ చిహ్నంగా ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కాపాడుకోవాలి. ప్రతి దశలోనూ ప్రజా చైతన్యం వెల్లువెత్తడం.. నిరంకుశ పోకడలను తిప్పికొట్టడం ఈ పరిశ్రమ ప్రత్యేకత. తెలుగుగడ్డపై విశాఖ ఉక్కు పోరాటం... మొక్కవోని దీక్షకు... ప్రజా ఉద్యమ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిపోతుంది.

మహనీయుల మాట



'చరిత్ర పునరావృతమవుతుంది. మొదట విషాదంగా, రెండవసారి ప్రహసనంగా..'.

-కారల్ మార్క్స్

వ్యాసం

మతతత్వ శక్తులను ఓడిస్తేనే దేశానికి రక్ష

ఒక లౌకిక, ప్రజాస్వామిక భారతదేశం కోసం పాటుపడేవారికి, స్వాతంత్ర్యపోరాట విలువలకు కట్టుబడి ఉండే వారికి ఆరెస్సెస్ అధినేత ఇంటర్వ్యూ ఒక బెదిరింపు అనే చెప్పాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ విధ్వంసాలు రాజ్యాంగం ఇచ్చిన అనేక వాగ్దానాలు అమలుకాకుండా ఈ మతతత్వశక్తులు అడ్డుకుంటున్నాయి..ఆ ఇంటర్వ్యూలో చెప్పినట్లు ఈ శక్తులు మోడీ ప్రభుత్వ అండదండలతో రాజ్యాధికారం పై అదుపు సాధించాయి. దీనికి సమాధానం ప్రత్యామ్నాయ విధానాల్లో, ప్రజా సమీకరణల్లో ఉంది. హిందూత్వ శక్తుల తాజా ఎజెండాను ఓడించాలంటే ప్రతిఘటనా శక్తిని పెంచుకోవడంతో బాటు, పెట్టుబడిదారీ లూటీకి వ్యతిరేకంగా ప్రజలను పెద్దయెత్తున సమీకరించాల్సిన అవసరముంది.

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ "ఆర్గనైజర్","పాంచజన్య" పత్రికల సంపాదకులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు హిందూ రాజ్యస్థాపనకు సంబంధించి ఆరెస్సెస్ స్థాపకులు హెడ్గే వార్, గోల్వాల్కర్ల మాటలను బలపర్చేవిగా ఉన్నాయి. "హిందుస్థాన్ ఒక హిందూ రాజ్యం. అభివద్ధి చెందుతున్న శక్తివంతమైన హిందూసమాజం, హిందూరాజ్యం, భారత్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లి, ప్రపంచానికి నాయకత్వాన్ని అందిస్తుంది" అని భగవత్ అన్నాడు. భారతదేశం, బ్రిటీష్ వలస దేశంగా ఉన్నప్పుడే ఆరెస్సెస్ తన ప్రణాళికను చాలా స్పష్టంగా వివరించింది. నేడు స్వాతంత్ర్య భారతదేశం సొంత రాజ్యాంగాన్ని కలిగి ఉంది. ఆరెస్సెస్ అధినేత అసాధారణమైన వ్యాఖ్యలు,ఆరెస్సెస్ ఎన్నటికీ భారత రాజ్యాంగాన్ని అంగీకరించదనే విషయాన్ని మరోసారి తేటతెల్లం చేశాయి. నేడు ఆరెస్సెస్ "వనరులు", "సమద్ధి", "సాధనాల"ను కలిగి ఉంది.ఆ వనరులు ఏమిటి, ఎలా సమద్ధిగా ఉంది, ఆ సాధనాలు ఎక్కడి నుండి వస్తున్నాయని అడగడం సముచితంగా ఉంటుంది.

గోల్వాల్కర్ విస్తరించిన "అంతర్గత శత్రువు"

ఆ ఇంటర్వ్యూ "హిందూ సమాజానికి" సంబంధించిన చర్చ కోసం ఉద్దేశించినది. కానీ ఆరెస్సెస్ చీఫ్ ప్రకటించిన 'హిందూ సమాజం' అనే భావనకు భారత రాజ్యాంగంలో చోటు లేదు. ఆయన చెప్పేదాని ప్రకారం "హిందూ సమాజం వెయ్యి సంవత్సరాలకు పైగా యుద్ధంలో ఉంటుంది కాబట్టి, యుద్ధంలో ఉండే వారు దూకుడుతనంతో ఉండడం సహజం". అందువల్ల స్థానిక భూస్వామ్య ఆధిపత్యవర్గాల సహాయంతో, దురాక్రమణ దారులకు,విజేతలకు మధ్య జరిగిన యుద్ధాలను, హిందూ ముస్లింలకు మధ్య జరిగిన మత యుద్ధాలుగా మార్చారు. చారిత్రక అన్యాయాలను సవరించే పేరుతో నేటి "హిందువుల దూకుడుతనాన్ని" న్యాయమైందిగా చెపుతున్నారు. ఆయన మాటల్లో చెప్పాలంటే "ఇది బయటి శత్రువు కాదు అంతర్గత శత్రువు. కాబట్టి హిందూ సమాజాన్ని, హిందూధర్మాన్ని, హిందూ సంస్కతిని రక్షించుకోడానికి యుద్ధం తప్పదు" అని అంటాడు. "భారతదేశంలో నివసిస్తున్న ముస్లింలు వారి విశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండాలనుకుంటే , వారి పూర్వీకుల విశ్వాసాలను తిరిగి ఆచరించాలనుకుంటే, వారికెలాంటి ప్రమాదం ఉండదు, వారు భయపడాల్సిన పని లేదు. కానీ అదే సమయంలో ముస్లింలు తమ ఆధిపత్య ప్రసంగ గర్జనలను వదిలిపెట్టాలి.ముస్లింలు భారతదేశాన్ని తిరిగి పాలించబోతున్న "ఉన్నత జాతి" అనే కథనాన్ని ముస్లింలు వదిలెయ్యాలి.వాస్తవానికి ఇక్కడ నివసించే వారంతా, వారు హిందువులైనా, కమ్యూనిస్టులైనా ఈ తర్కాన్ని వదిలిపెట్టాలని"ఆయన అన్నాడు.



బృందాకరత్

ఆరెస్సెస్ తప్పుడు కథనాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టుల వలె రాజీపడని వారిపై దాడి చెయ్యడం, వారిని బెదిరించడం, భయపెట్టడమే ఆరెస్సెస్ తర్కం." హిందూ జాతికి పూర్తిగా లోబడి ముస్లింలు భారతదేశంలో నివసించవచ్చని" గోల్వాల్కర్ అన్నాడు. భగవత్ ప్రకటనలు,చట్టం నుండి తప్పించుకోడానికి సవరించినప్పటికీ ఆరెస్సెస్ పరిశీలనలో ముస్లింలను లొంగదీసుకోవడం, సంఘ్ పరివార్ నేరపూరిత దాడులను చూసీచూడనట్లుండడం, ఇవన్నీ అంతర్గత శత్రువుకు వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించే లక్ష్యాలేనన్న మాట. ఈ యుద్ధంలో గోల్వాల్కర్ ముస్లింలు,కమ్యూనిస్టులు, క్రైస్తవులు శత్రువులనే నిర్వచనంటిచ్చారు. అంతటితో ఆగకుండా ఆరెస్సెస్ కథనాలకు అనుగుణంగా లేని హిందువులను కూడా శత్రుజాబితాలో చేర్చడం జరిగింది.అంటే ఇక్కడ నివసించే భారతీయ పౌరులు ప్రశాంతంగా జీవించాలంటే భారత రాజ్యాంగానికి అనుగుణంగా కాక ఆరెస్సెస్ కు అనుగుణంగా ఉండాలి.

ఆరెస్సెస్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఇస్లామిక్ ఛాందసవాదులు చెలరేగడానికి ఊతమిస్తాయి. ఇటువంటి చర్యల ద్వారా ఆరెస్సెస్ తన మత విభజన వ్యూహాలను మరింతగా బలపరచుకోవాలని చూస్తోందన్నది సిపిఐ(ఎం) అభిప్రాయం. ఒక మతతత్వం మరొక మతతత్వాన్ని బలోపేతం చేస్తుందని సిపిఐ(ఎం) పదేపదే చెప్పే విషయాన్ని భగవత్ ఇంటర్వ్యూ మరోసారి రుజువు చేసింది.

కుల హింసను పట్టించుకోని ఆరెస్సెస్

భగవత్ "హిందూ సమాజపు" స్వయంనియామక ప్రతినిధిగా "సమాజం" తరపున అనాగరికమైన వాదనలు చేస్తూ మాట్లాడతాడు. మతానికి ఎలాంటి సంబంధంలేని హిందూత్వ రాజకీయ భావనా కవచాన్ని ప్రకటించడం ఒకటైతే, ఈ దేశంలో అత్యధికంగా ఉన్న ప్రజలంతా హిందూమతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారనేది రెండవది. కానీ మతపరంగా హిందువులైన ప్రజలు ఆరెస్సెస్ ఆలోచనలను సమ్మతించడం లేదు. ఆరెస్సెస్ నాయకునికి దళితులకు వ్యతిరేకంగా పెచ్చరిల్లుతున్న హింసాత్మక చర్యలు అసలు ఒక సమస్యగా కనిపించవు. "శ్రీరాముడే అన్ని జాతులను, వర్గాలను కలిపి ఉంచుతాడు" అనేదే కులానికి సంబంధించిన ఏకైక ప్రస్తావన. హిందూత్వ గుర్తింపు నిర్మాణంలో జైశ్రీరామ్ నినాదం ఒక రాజకీయ సాధనంగా చేసుకుంటున్నది. దళితులు అగ్రవర్ణ హిందువుల చేతుల్లో వివక్షతను, హింసను, లైంగిక దాడులను ఎదుర్కొంటున్నదానిపై భగవత్ ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు .

ఆరెస్సెస్ అధినేత మాటల్లో "పేదరికం" ఊసే లేదు

భగవత్ " శక్తివంతమైన, సంపన్న హిందూ సమాజం" గురించి మాట్లాడతాడు. తీవ్రమైన పోషకాహార లోపం, అత్యధిక జనం ఆకలితో అలమటిస్తున్న దేశాలలో ఒకటిగా భారతదేశం ప్రపంచ ఆకలి సూచీ లో అవమానకరమైన స్థానంలో ఉంటే ఆయన "సంపన్నం" గురించి మాట్లాడ్డం చాలా హాస్యాస్పదంగా ఉంది. భారతదేశాన్ని ధ్వంసం చేస్తున్న సామాజిక, ఆర్థిక అసమానతలు,సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న కష్టాల గురించి సంఘ్ అధినేత ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఆరెస్సెస్‌కు కార్మికులు, రైతులు అనే వర్గాలు లేవు. వారి దష్టిలో అంతా హిందూ సమాజంగా పిలువబడే దానిలోనే దాగి ఉంటారు. కాబట్టి, ఆదానీ రోజుకు సగటున 1216 కోట్ల రూపాయలు, గ్రామీణ మహిళ రోజుకు కేవలం 250 రూపాయలు సంపాదిస్తే, ఆరెస్సెస్ వారిరువుర్నీ హిందూ సమాజం పేరుతో ఒకే గాటన కడుతుంది. ఆరెస్సెస్ సష్టించాలనుకునే ముఖ్యమైన హిందూత్వ గుర్తింపులో భాగంగా ధనికులను,పేదలను గుర్తించడానికి నిరాకరించడం ద్వారా ఆరెస్సెస్ అధినేత భారీ అసమానతలను సమర్థిస్తున్నాడు. జనాభాలో అధిక సంఖ్యాక ప్రజల తక్కువ కొనుగోలు శక్తిని ప్రతిబింబించే అధికారిక సంఖ్యలు ఉన్నప్పటికీ, అధిక సంఖ్యాక భారతీయులు అధిక ధరలతో బాధపడుతున్నప్పటికీ, ద్రవ్యోల్బణం అనేది "వినియోగతత్వం" విధి అనీ, ప్రజలు అవసరానికి మించి అధికంగా కొనుగోలు చేస్తున్నందువల్లే ధరలు పెరిగిపోతున్నాయని సంఘ్ నాయకుడు అభిప్రాయపడుతున్నాడు. భారతదేశం ప్రస్తుతం మాంద్యం అంచున ఉంది.ఆఖరికి పెట్టుబడిదారీ అనుకూల ఆర్థికవేత్తలు కూడా డిమాండ్‌ను పెంచే విధానాలతో ముందుకు పోతున్నారని, అయితే ధరల పెరుగుదలకు ప్రజలే కారణమని ఆరెస్సెస్ నేత నిందిస్తున్నాడు.

రాజ్యాంగేతర శక్తిగా ఆరెస్సెస్

ఇంటర్వ్యూలో భగవత్ ఆరెస్సెస్, దాని స్వయం సేవకులు, రాజకీయాలు, ప్రభుత్వం మధ్య ఉండే సంబంధం గురించి మాట్లాడినప్పుడు మరో అంశం బహిర్గతమైంది. ఆరెస్సెస్ ఒక "సాంస్కతిక" సంస్థ అనీ, దానికి రోజువారీ రాజకీయాల్లో ఆసక్తి లేదనీ, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ఇష్టం లేకపోయినప్పటికీ ప్రభుత్వ వ్యవహారాల్లో బలవంతంగా జోక్యం చేసుకుంటుందని అంగీకరిస్తూ ఆయన ఓ కట్టుకథను అల్లారు. "ఇంతకు ముందున్న తేడా ఏమంటే,మా స్వయం సేవకులు అధికార స్థానాల్లో లేరనీ, రాజకీయాల్లో స్వయం సేవకులు ఏమి చేసినా వాటికి మేము బాధ్యత వహిస్తాం. స్వయం సేవకులకు శిక్షణ ఇచ్చిన సంఘ్ కే అంతిమంగా "కొంత బాధ్యత" ఉంటుంది. అందువల్ల మా సంబంధం ఏమిటి,ఏ అంశాలను జాగ్రత్తగా కొనసాగించాలి అనే విషయాలను గురించి ఆలోచించాల్సి వస్తుందని" అంటాడాయన. ఇప్పుడు "తేడా" ఏమంటే, ప్రధానమంత్రి గతంలో ప్రచారక్ గా పని చేశాడు. యూనియన్ మంత్రిమండలిలో 71% మంది మంత్రులకు ఆరెస్సెస్ తో సంబంధాలు ఉన్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా చాలా మంది మంత్రులకు ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు, సంఘాలతో సంబంధాలు ఉన్నాయి. ప్రభుత్వం లోని స్వయం సేవకుల పై తన పర్యవేక్షణ ఉంటుందని ఆరెస్సెస్ ప్రకటించింది.ఆ "కొంత బాధ్యత" అంటే అర్థమేమిటి?

"ఒకవేళ ప్రజలు ఏదో ఒకటి ఆశిస్తూ, వారు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటూ,వాటిని మాకు తెలియజేస్తే, అప్పుడు సంబంధిత వ్యక్తుల దష్టికి తీసుకొని వెళ్ళొచ్చు, ఒకవేళ వారు స్వయం సేవకులైతే, అంతా మేమే చేసేస్తాం".

"మేం చేసే" దానిలోని చిక్కుల్ని చూడండి. సంఘ్ లో శిక్షణ పొందిన మూడింట రెండొంతుల మంది మంత్రివర్గ సభ్యుల పర్యవేక్షణ ("కొంత బాధ్యత"), విధానాలలో జోక్యం (శ్రద్ధతో కొన్ని విషయాలు), స్వయం సేవకులైన మంత్రులకు ఆరెస్సెస్ సిఫార్సులు (సంబంధిత వ్యక్తుల దష్టికి తీసుకొనిరావడం). రాజ్యాంగేతర శక్తి అంటే ఇదే. బిజెపి రాష్ట్ర ప్రభుత్వాల పై ఆరెస్సెస్ చెలాయిస్తున్న అధికారం రహస్యమేమీ కాదు. దీనిని ఇప్పుడు ఆరెస్సెస్ అధినేతే స్వయంగా చెప్పాడు.

"మేము మీడియాను కలుసుకునే సందర్భాల సంఖ్యను పెంచాం, ప్రజలకు సేవలందించే కార్యక్రమాలను ప్రారంభించాం. ఆశించిన ఫలితాల సాధన కోసం మేం సరైన వ్యూహంతో, సరైన సమయంలో స్పందించాల్సి ఉంటుందనీ, రానున్న రోజుల్లో ఆరెస్సెస్ పై పొగడ్తల జల్లు కురిపిస్తూ, దానిపై ఉన్న ద్వేషాన్ని తగ్గించే కథలను గూర్చి వింటామని" భగవత్ చెప్పాడు.

మహిళల పట్ల చిన్నచూపు

హక్కుల ఆధారిత ప్రజాస్వామిక చట్రాన్ని గుర్తించ నిరాకరించడం కూడా మహిళల గురించి చేసిన వ్యాఖ్యల్లో ప్రతిబింబిస్తుంది. ఆరెస్సెస్ వారి దష్టిలో మహిళ అంటే కుటుంబంలో ఒక భాగం. "మహిళా విముక్తి, మహిళా సాధికారత గురించి చాలా కాలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇప్పుడు పాశ్చాత్య మహిళలు, స్త్రీ పురుషులు పరస్పరం ఆధారితంగా ఉండే కుటుంబ జీవనానికి తిరిగి వస్తున్నారని" భగవత్ అంటున్నాడు. ఆరెస్సెస్ ఉద్దేశంలో, ఒక స్వతంత్ర మనస్తత్వం, సాధికారత ,సమాన హక్కులు గల మహిళకు కుటుంబ జీవితంతో పొసగదట.ఎందుకంటే ఆరెస్సెస్ భావజాలం ప్రకారం, కుటుంబంలో మహిళలకు మనువాద విధానాల మార్గదర్శకత్వం ఉంటుంది కాబట్టి, హింస ఎదురైతే మహిళలు సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఇది, ఆరెస్సెస్ మహిళా విభాగం "రాష్ట్రీయ సేవికా సమితి" చేస్తున్న ప్రచారం. కానీ ఈ సమితి విఫలమైన ప్రణాళిక అని ఆరెస్సెస్ నేత స్వయంగా అంగీకరించాడు. నేడు సమితికి అంత బలం లేదు.శాఖల ద్వారా నేర్చుకునే మహిళల సంఖ్య పెరుగుతుంది కాబట్టి వారిని సేవికా సమితికి పంపకుండా నేరుగా సంఘ్ లోకి ఇముడ్చుకోవడం ఎలా అనే విషయాన్ని ఆరెస్సెస్ కసరత్తు చెయ్యాలని ఇప్పుడు ఆయన చెపుతున్నాడు. ద్వేషపూరిత ప్రసంగాలు,రెచ్చగొట్టే ప్రకటనలు చేసే ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ లాంటి హిందూత్వ దళానికి చెందిన మహిళా సభ్యులు ఆరెస్సెస్ కు ఆదర్శంగా ఉన్నారు. పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలతో పాటు మహిళల పై పెరుగుతున్న హింస, వరకట్న మరణాలపై సంఘ్ నేత మౌనం వహిస్తున్నాడు.


ఒక లౌకిక, ప్రజాస్వామిక భారతదేశం కోసం స్వాతంత్ర్యపోరాట విలువలకు కట్టుబడి ఉండే వారికి, ఆరెస్సెస్ అధినేత ఇంటర్వ్యూ ఒక బెదిరింపు అనే చెప్పాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ విధ్వంసాలు రాజ్యాంగం ఇచ్చిన అనేక వాగ్దానాలు అమలుకాకుండా ఈ మతతత్వశక్తులు అడ్డుకుంటున్నాయి..ఆ ఇంటర్వ్యూలో చెప్పినట్లు ఈ శక్తులు మోడీ ప్రభుత్వ అండదండలతో రాజ్యాధికారం పై అదుపు సాధించాయి. దీనికి సమాధానం ప్రత్యామ్నాయ విధానాల్లో, ప్రజా సమీకరణల్లో ఉంది. హిందూత్వ ఆధునీకరణ ఎజెండాను ఓడించాలంటే ప్రతిఘటనా శక్తిని పెంచుకోవడంతో బాటు, పెట్టుబడిదారీ లూటీకి వ్యతిరేకంగా ప్రజలను పెద్దయెత్తున సమీకరించాల్సిన అవసరముంది. ★

విశ్లేషణ

అదానీ బాగోతంపై నోరు విప్పరేం!

-సత్య

మోడీ అంటే అదానీ - అదానీ అంటే మోడీ అన్న వాతావరణం దేశంలో ఉన్నమాట వాస్తవం. మోడీ సర్కార్ విధానాలను విమర్శించటం దేశద్రోహం అని చిత్రించినట్లుగానే ఇప్పుడు అదానీ కంపెనీ గురించి ఏదైనా ప్రతికూల అంశాలను చెబితే దాన్ని కూడా దేశద్రోహం అనే స్థితికి వెళ్లారు. మన వారు ధనికులు కావటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని నిందిస్తున్నారు. అదానీ కంపెనీ ఆర్థిక విభాగ అధిపతి జగుషిందర్ సింగ్ మరో అడుగుకు ముందుకేసి హిండెన్ బర్గ్ నివేదికను బ్రిటీష్ వారి జలియన్‌వాలాబాగ్ మారణకాండతో పోల్చారు.



"**వి**దేశీయులు చెప్పింది నమ్ముతారు తప్ప భారతీయులు చెప్పింది నమ్మరు " అదానీ షేర్ల కుంభకోణాన్ని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ బట్టబయలు చేయడంపై స్వయం ప్రకటిత " దేశభక్తులు వీరావేశంతో అన్నమాటలివి. ఆత్మనిర్భర్ భారత్ పేరుతో ప్రకటించిన భరోసా, రాయితీల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయటంతో 2022లో ప్రపంచ స్టాక్‌మార్కెట్లో మన వాటాల విలువ 3.6శాతం పెరిగింది. ఇది ఎవరో విదేశీయులో మరొకరో చెప్పిన మాటలను బట్టి కాదు పక్కా భారతీయులు చెప్పిందాన్ని నమ్మబట్టే. కానీ తాజాగా ఒక విదేశీ కంపెనీ చెప్పిన అంశాలతో స్టాక్ మార్కెట్‌లో ఆ షేర్ల విలువ ఒక్కసారిగా 3.1శాతం (3.2లక్షల కోట్ల డాలర్లు) తగ్గింది. అబ్బే, అక్రమాలేం జరగలేదని పక్కా భారతీయుడు అదానీ జాతీయ జెండాను ఎగురవేసి 413 పేజీల వివరణ ఇచ్చినా మార్కెట్లో అతని కంపెనీల షేర్ల పతనం ఆగలేదు. గుజరాత్ మారణకాండ విషయంలోనూ అంతే. ఈ కుహనా దేశభక్తులు చెప్పినదాన్ని జనం విశ్వసించడం లేదు, బిబిసి చెప్పినదాన్ని విశ్వసిస్తున్నారు. నాడు జరిగిన ఉదంతాలపై బ్రిటీష్ రాయబారి తమ దేశానికి నివేదించిన అంశాలను బిబిసి వెల్లడించింది. విశ్వహిందూపరిషత్ వంటి సంస్థల పాత్ర గురించి అది తెలియజేసింది. చేతిలో అధికారం ఉంది కదా అని నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాజిక మాధ్యమాల్లో ఆ డాక్యుమెంటరీని కనిపించకుండా చేసింది. అయినా, అవి బయటకు తన్నుకొస్తూనే ఉన్నాయి. ప్రపంచంలోని పలు దేశాలు, చివరికి మన దేశానికి సంబంధించి అనేక అంశాల మీద సమాచారం కోసం బిబిసి రేడియో మీదనే ఆధారపడిన రోజులు దేశంలో ఉన్నాయి.1975లో అత్యవసర పరిస్థితి ప్రకటన అనేక మంది ముందుగా దాని ద్వారానే తెలుసుకున్నారు. మన ప్రభుత్వ, ప్రయివేటు మీడియా సంస్థలు పాలకులకు బాకాలుగా మారిన స్థితిలో నిజాల కోసం పరితపించిన జనాలు విదేశీ మీడియా కోసం ఎదురు చూస్తున్నారు.. మన దూరదర్శన్ కన్నా బిబిసి అనేక రెట్లు విశ్వసనీయమైనదని ఓ ఎన్నికల ప్రచార సభలో సాక్షాత్తు మోడీయే అన్న విషయం మరచిపోరాదు.

మోడీ అంటే అదానీ - అదానీ అంటే మోడీ అన్న వాతావరణం దేశంలో ఉన్నమాట వాస్తవం. మోడీ సర్కార్ విధానాలను విమర్శించటం దేశద్రోహం అని చిత్రించినట్లుగానే ఇప్పుడు అదానీ కంపెనీ గురించి ఏదైనా ప్రతికూల అంశాలను చెబితే దాన్ని కూడా దేశద్రోహం అనే స్థితికి వెళ్లారు. మన వారు ధనికులు కావటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని నిందిస్తున్నారు.

అదానీ కంపెనీ ఆర్థిక విభాగ అధిపతి జగుషిందర్ సింగ్ మరో అడుగుకు ముందుకేసి హిండెన్ బర్గ్ నివేదికను బ్రిటీష్ వారి జలియన్‌వాలాబాగ్ మారణకాండతో పోల్చారు. దేశం మీద, దాని సంస్థల మీద పథకం ప్రకారం జరిపిన దాడి అన్నారు. జనవరి 24న హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడైంది. తరువాత స్టాక్ మార్కెట్లో అదానీ కంపెనీల వాటా ధరల పతనానికి దారితీసింది. రాచపీనుగ ఒంటరిగా పోదన్నట్లు అదానీ షేర్ల పతనం మిగతా కంపెనీల షేర్ల పైనా పడింది. కొన్ని లక్షల కోట్ల మేరకు వాటాదార్ల సంపద ఆవిరైంది. సోమవారం నాడు రాయిటర్ వార్తా సంస్థ ఇచ్చిన కథనం మేరకు 65బిలియన్ డాలర్ల సంపద హరీమంది. ప్రతి పైసాకు జవాబుదారీగా ఉంటానని చెప్పిన చౌకీదార్ ప్రధాని నరేంద్రమోడీ ఇంతవరకు దీని మీద ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంత పెద్ద కుంభకోణం మీద జనాలకు ఏదో ఒకటి చెప్పాలా లేదా ? నిజంగా అదానీ కంపెనీల నిజాయితీ మీద అంత నమ్మకం ఉంటే అవి ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ప్రకటించి అనుమానాలకు తెరదించాలి, మోడీ మౌనానికి అర్థం ఏమిటి ?మన్మోహన్ సింగ్‌ను మౌన ముని అంటూ ఎద్దేవా చేసిన వారు మోడీ మూగనోముపై మాట్లాడరేం?

2014లో అదానీ సంపదల విలువ 8 బిలియన్ డాలర్లు కాగా 2022లో అది 137బి.డాలర్లకు (1,600శాతం) పెరిగింది. ఈ వాస్తవాన్ని కాదనగలరా ? మిగతా కంపెనీలకు లేని ఈ అసాధారణ పెరుగుదల అదానీకి ఎలా వచ్చింది ? ఏదైనా మంత్రదండం ఉందా ? వందల సంవత్సరాలుగా పారిశ్రామికవేత్తలుగా ఉన్న టాటా, బిర్లా, తరువాత వచ్చిన అంబానీ కంపెనీలకు రాని లాభాలు అదానీకి ఎలా వచ్చినట్లు ? క్రోనీ కేపిటలిజానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యం.

హిండెన్‌బర్గ్ లేవనెత్తిన అంశాల్లో అదానీ గ్రూపు రుణాల గురించి మాత్రమే కాదు అదొకటి మాత్రమే. పన్ను స్వర్గాలతో సంబంధాలు పెట్టుకొని ఎగవేసినట్లు కూడా ఆరోపించింది. రుణ ఎగవేతదార్ల జాబితాలో అదానీ ఉన్నట్లు ఎవరూ చెప్పటం లేదు, అలాంటి ప్రమాదం ఉందని మాత్రమే అంటున్నారు.2015లోనే క్రెడిట్ సూసీ తన నివేదికలో తీవ్ర రుణ వత్తిడిని ఎదుర్కొంటున్న పది సంస్థలలో అదానీ గ్రూపు ఒకటని పేర్కొన్నది. తాజాగా అమ్మకానికి పెట్టిన ఎఫ్‌పిఓ వాటాలతో వచ్చిన సొమ్మును కొత్త పెట్టుబడి కోసం గాక ఇప్పటికే ఉన్న కంపెనీల అప్పులు తీర్చేందుకు అన్నది తెలిసిందే. బమ్మిని తిమ్మిని చేసి లేని విలువను సృష్టించి మోసానికి పాల్పడిన సత్యం కంపెనీ మాదిరి అదానీ చేసినట్లు చెప్పింది, దాని గురించి చెప్పకుండా రుణాల చుట్టూ తిప్పుతున్నారు. ఎల్ఐసి పెట్టిన పెట్టుబడుల కంటే ఇప్పటికీ విలువ ఎక్కువే ఉన్నదని, నష్టం లేదు కదా అని లెక్కలు చెబుతూ పక్కదారి పట్టించేందుకు చూస్తున్నారు. ఎల్ఐసి కొనుగోలు చేసిందంటే కంపెనీ విశ్వసనీయత కలిగినదని మదుపుదార్లు విశ్వసిస్తారు. అందుకోసమే కేంద్ర ప్రభుత్వ పెద్దలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించి ఉంటారన్నది ఒక అభిప్రాయం.

అదానీ కంపెనీలకు ఎస్‌బిఐ రుణాలు ఇవ్వటం, ఎల్ఐసి పెద్ద మొత్తంలో వాటాలు కొనటం వెనుక బిజెపి పెద్దల హస్తం ఉందన్న విమర్శలున్నాయి. అసలు వీరి సమస్య ఏమిటి ? ఆ పని చేస్తే నరేంద్రమోడీకి ఎవరు అడ్డుపడ్డారు ? ఇడి, సిబిఐలను అలాంటి అక్రమాల నిగ్గుతేల్చేందుకు పంపండి. అధికారానికి వచ్చి తొమ్మిదేళ్లు , అరిగిపోయిన రికార్డులను ఎన్ని సంవత్సరాలు ఇంకా వినిపిస్తారు ?

హిండెన్‌బర్గ్ లేవనెత్తిన అంశాలకు అదానీ కంపెనీ 413 పేజీలతో సుదీర్ఘ వివరణ ఇచ్చింది.అసలు అంశాలను పక్కన పెట్టిందని, జాతీయతజెండాను కప్పి అక్రమాలను కనపడకుండా చేసేందుకు పూనుకున్నదని హిండెన్‌బర్గ్ స్పందించింది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీకి సంబంధించిన విదేశీ సూట్‌కేస్ కంపెనీల లావాదేవీల గురించి తాము ప్రశ్నించినదానికి సమాధానం లేదని పేర్కొంది. వాటికి అదానీ కంపెనీల నుంచి పంపినవి, తిరిగి వాటి నుంచి అదానీ కంపెనీలకు చేరిన బిలియన్ల డాలర్ల నిధుల సంగతేమిటని, అవి వినోద్ అదానీకి ఎక్కడి నుంచి వచ్చిందీ చెప్పాలని హిండెన్‌బర్గ్ కోరింది. దానికి అదానీ కంపెనీ ఇచ్చిన వివరణ ఏమిటో తెలుసా ! " ఆ కంపెనీలకు నిధులు ఎక్కడివో మాకు తెలియదు, ఎక్కడి నుంచి వచ్చిందీ తెలుసుకోవాల్సిన అవసరమూ మాకు లేదు. వినోద్ అదానీ వాణిజ్యం, లావాదేవీల గురించి వ్యాఖ్యానించే స్థితిలో మేము లేము " అని పేర్కొన్నారు. అదే గనుక నిజమైతే గౌతమ్ అదానీ తన సోదరుడిని విడిగా లేదా కుటుంబ సంస్థను నడుపుతున్నారు గనుక భోజన టేబుల్ దగ్గర గానీ ఆ వివరాలన్నీ అడిగి రహస్యాన్ని చేధించాలని, తాము లేవనెత్తిన ప్రశ్నలలో 62 నుంచి 88 వరకు నిర్దిష్ట సమాధానాలు చెప్పలేదని పేర్కొన్నది.

హిండెన్‌బర్గ్ సంస్థ నివేదికపై కుట్ర థియరీని బిజెపి ముందుకు తెస్తోంది. బిబిసి డాక్యుమెంటరీపై బుకాయించి మరింత అపఖ్యాతిని మూటగట్టుకుంది. ఇప్పుడు హిండెన్‌బర్గ్ నివేదిక విషయంలోనూ అలాగే వ్యవహరిస్తోంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు అస్త్ర శస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ దీనిపై ఇప్పటికైనా నోరు విప్పాలి. అదానీ షేర్ల కుంభకోణంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలి. అందుకు ఈ నిరంకుశ ప్రభుత్వం సిద్ధపడుతుందా అన్నదే ప్రశ్న.

జనవాక్యం

' జోడో ' యాత్ర ముగిసింది -ఇక జోడీ యాత్ర

రాహుల్ గాంధీ ఇక జోడీ యాత్ర చేయాల్సివుంది అని నేనంటే అపార్థం చేసుకోవద్దు.అందునా ఆయన ఈ మధ్య ఇంటర్వ్యూ ఇస్తూ 'పెళ్లికూతురు ని వెదకాల్సి ఉందని' అన్నాడాయే. ఆ ఉద్దేశ్యంతో జోడీ యాత్ర చెయ్యమనడం లేదు. చెప్తున్నదల్లా రాజకీయ కోణంలో. రాజకీయంగా తమ పార్టీ ఎంత బలపడినా జాతీయ స్థాయిలో బీజేపీ కి ప్రత్యామ్నాయం కాలేదు సరికదా ఆ దగ్గరకు కూడా రాలేదన్నది కఠిన వాస్తవం. ఇప్పుడు చూడాల్సింది ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో తన బలం పెంచుకోవడం తో బాటు,కలిసొచ్చే ప్రాంతీయ పార్టీలను వెదుక్కోవడం. అవసరమైతే కొంచెం తగ్గి,ప్రత్యామ్నాయం బలంగా తయారయ్యేలా సర్దుబాటు ధోరణితో ముందుకు వెళ్లడం.నాయకత్వం తనకే కావాలన్న ధోరణి కాకుండా మంచి టీం ప్లేయర్ గా వ్యవహరించ గలిగేలా తమనుతాము మలచుకోవడం.ఇది ఆ పార్టీకే కాకుండా,రాజకీయ రంగానికే మంచి చెయ్యగల అత్యవసర కార్యక్రమం.

కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకూ 12 రాష్ట్రాలు,2 కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా ఐదు నెలల పాటు రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఒక మంచి కార్యక్రమం. విజయవంతంగా,నిరాటంకంగా దాన్ని పూర్తి చేసిన ఆయన అభినందనీయులు. ఈ యాత్రతో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఉపయోగం ఎంతన్నది పక్కన పెడితే రాహుల్ గాంధీ వ్యక్తిగత ప్రతిష్ట ఎంతోకొంత పెంచిందన్నది వాస్తవం.జనాల్లో ఆయన ఏమాత్రం సీరియస్ నెస్,నిలకడ లేని నేత అన్న నెగెటివ్ పర్సెప్షన్ ని కొంత వదిలించుకున్నారు. గ్రామీణ భారతం,ప్రస్తుత సమస్యల పట్ల కొంత అవగాహన పెరిగే ఉంటుంది.ఆలోచనల్లో స్పష్టత కనబడుతోంది.సర్జికల్ స్ట్రైక్ పై తన పార్టీలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన అనవసరపు వాచాలతని వెనకేసుకు రాకుండా హుందాగా స్పందించడమే అందుకు ఉదాహరణ.అయితే ఈ యాత్ర ఆయనకు మొదటి అడుగు. అంతే. తన పార్టీని చక్కదిద్దడానికి,జాతీయ స్థాయిలో గుర్తింపదగ్గ ఫోర్స్ గా తయారుచెయ్యడానికి ఇంకా మరిన్ని అడుగులు పడాలి. అది కష్టమైన మార్గం కూడా.ఆయనకు ఆల్ ది బెస్ట్.

- డా. డి.వి.జి.శంకర రావు , మాజీ ఎంపీ, పార్వతీపురం.

అప్పుల భారతం

- కేంద్రం అప్పు రూ.134.08 లక్షల కోట్లు
- ఆరేళ్లలోనే రూ.68.81 లక్షల కోట్ల పెరుగుదల
- ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ
- ఆర్థిక సర్వే వెల్లడి

రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేయాల్సిన నిధులు

కేటాయింపు	విడుదల	(రూ.కోట్లలో)
రెవెన్యూ లోటు	86,201	57,467
విపత్తు నిర్వహణ	23,294	10,976
స్థానిక సంస్థల నిధులు	69,421	28,609
ఆరోగ్య రంగం నిధులు	13,192	275

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్పు రూ.134.08 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వే ప్రవేశపెట్టారు. గత ఆరేళ్లలోనే కేంద్రం రూ.68.81 లక్షల కోట్లు అప్పు చేసినట్లు పేర్కొంది. 15వ ఆర్థిక సిఫార్సుల్లో భాగంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయటం లేదు. దాదాపు రూ.30,878 కోట్లు ఇంకా విడుదల చేయకుండా కేంద్ర పెండింగ్‌లో ఉంచింది.

రూ.4 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ

గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణతో రూ.4.07 లక్షల కోట్లు సమకూరినట్లు కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.65 వేల కోట్లను లక్ష్యంగా నిర్దేశించుకోగా, 48 శాతం లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకుందని, రూ.31 వేల కోట్లు ఖజానాకు చేరినట్లు పేర్కొంది. ఐడిబిఐతో పాటు షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్ఎండిసి స్టీల్ లిమిటెడ్, బిఈఎంఎల్, హెచ్ఎల్ఎల్ లైఫ్కర్, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలను విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపింది.

ఎంఎస్ఎంఇలను ఆదుకున్న అత్యవసర రుణ హామీ

కరోనా కారణంగా బాగా దెబ్బతిన్న సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఇ) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యవసర రుణ హామీ పథకం (ఇఎల్‌సిజిఎస్) ఆదుకుందని ఆర్థిక సర్వే తెలిపింది. ఎంఎస్ఎంఇలకు 2022 జనవరి-నవంబర్ మధ్య సగటున 30.6 శాతం అధికంగా రుణాలు మంజూరు చేసినట్లు ఆర్థిక సర్వే తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం అప్పు

ఏడాది	అప్పు (రూ.లక్షల కోట్లు)
2016	65.27
2017	70.16
2018	77.85
2019	86.35
2020	99.91
2021	116.98
2022	134.08

వృద్ధి రేటు తగ్గే అవకాశం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం వల్ల మన దేశ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని 2022-23 ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ 6 శాతం నుంచి 6.8 శాతం వరకు వృద్ధి చెందే అవకాశం ఉందని ఈ సర్వే అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 7 శాతం ఉంటుందని అంచనా. ఈ సంవత్సరం కన్నా వచ్చే ఏడాది తక్కువ వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన దేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) నామినల్ టెర్మ్స్‌లో 11 శాతం ఉంటుందని సర్వే అంచనా వేసింది.

రూపాయి మరింత ఒత్తిళ్లకు గురవుతుంది

కరెంట్ అకౌంట్ లోటు మరింత విస్తరిస్తే, ఇండియన్ కరెన్సీ రూపాయి ఒత్తిళ్లకు గురవుతుందని తెలిపింది. కరెంట్ అకౌంట్ డెఫిసిట్‌కు ఫైనాన్స్ చేయడానికి తగిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నట్లు ధీమా వ్యక్తం చేసింది.

స్వయం సహాయక బృందాల మహిళలపై ప్రశంసలు


కోవిడ్ మహమ్మారి సమయంలో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో స్వయం సహాయక సంఘాల మహిళలు పోషించిన పాత్రను ఈ నివేదిక ప్రత్యేకంగా వివరించింది. దేశంలో 12.6 శాతం మంది విద్యార్థుల డ్రాపౌట్స్ అయినట్లు ఆర్థిక సర్వే తెలిపింది. లేబర్ కోడ్స్ కు సంబంధించిన గెజిట్ విడుదల చేసినట్లు తెలిపింది. వేతన కోడ్‌ను 31, పారిశ్రామిక సంబంధాల కోడ్ 28, సామాజిక భద్రతా కోడ్ 28, ఆరోగ్య భద్రత, పని పరిస్థితుల కోడ్ 26 రాష్ట్రాలు నిబంధనలు విడుదల చేసినట్లు పేర్కొంది.

గ్రామీణ ద్రవ్యోల్బణంలో తెలుగు రాష్ట్రాలు

గ్రామీణ ద్రవ్యోల్బణంలో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని ఆర్థిక సర్వే తెలిపింది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక గ్రామీణ ద్రవ్యోల్బణం నమోదు చేసుకున్నట్లు పేర్కొంది. దీనికి పెట్రోలియం, దుస్తులు ధరలు పెరగడమే కారణమని తెలిపింది.

ప్రజా సమస్యల ప్రస్తావన లేదు

- నిరాశపరిచిన రాష్ట్రపతి ప్రసంగం
- సిపిఎం నేత ఎలమరం కరీం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ప్రసంగంలో ప్రజా సమస్యల ప్రస్తావన లేదని సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం అన్నారు. మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం నిరాశపరిచిందని అన్నారు. "రాష్ట్రపతి ప్రసంగం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ బుజ్జగింపు విధానాల కథనం తప్ప మరేమీ కాదు. 19 పేజీల ప్రసంగంలో కార్మికుడు అనే పదం ప్రస్తావనే లేదు. దేశంలోని వ్యవసాయ రంగం గురించీ ప్రస్తావించ లేదు. దేశంలోని అణగారిన ప్రజలతో కేంద్ర ప్రభుత్వం నిలబడదనే వాస్తవాన్ని ఇది సమర్థిస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు రాష్ట్రపతి ప్రసంగంలో భాగం కాకపోవడం బాధాకరం" అని అన్నారు. "వరుసగా రెండు పర్యాయాలు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని కలిగి ఉన్నందుకు గర్వపడుతున్నామని రాష్ట్రపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే గవర్నర్ల రాజ్యాంగ విరుద్ధమైన జోక్యాలను మరిచారు. కేంద్రంలో వరుసగా రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని అందించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల ఆదేశాన్ని తుంగలో తొక్కి అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బిజెపి కుట్రలను చూడడం లేదు" అని విమర్శించారు. "మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వ జోక్యాలను ప్రశంసిస్తూ ప్రసంగంలో పేర్కొన్న అనేక ప్రాజెక్టులు నిజానికి సామాన్యులకు ఏ విధంగానూ ఉపయోగపడని ప్రకటనలే. ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను అమ్మేసే విధానాన్ని అనుసరిస్తున్న ప్రభుత్వం దేశాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపిస్తుంది?" అని ప్రశ్నించారు. 'యువతకు ఉద్యోగావకాశాలు నిరంతరం కోతకు గురవుతున్నాయి. కార్మికుల హక్కులు ఒక్కొక్కటిగా హరించబడుతున్నాయి. మత సామరస్యాన్ని, సమైక్యతను ధ్వంసం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావించడం లేదు" అని విమర్శించారు. "రైతులను మోసం చేసిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే విధానాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. రైతులు ఢిల్లీలో ఆందోళన విరమించే సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడమే కాకుండా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. దేశ సంపద మొత్తాన్ని కార్పొరేట్ సంస్థలు కొల్లగొడుతున్నాయి. ఈ విధానాలు ఎలా దేశ ప్రగతికి ఉపయోగపడతాయి. రాష్ట్రపతి ప్రసంగం నిరాశపరిచింది. .అత్యంత దురదృష్టకరం" అని పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శి మహ్మద్ సలీం

పోరాడే వారిని గెలిపించండి

- పురూలియా సభలో సిపిఎం పిలుపు

కోల్‌కతా : పంచాయతీ ఎన్నికల్లో ప్రజల తరపున పోరాడే సిపిఎం, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా రాస్ మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు. బిజెపి, తృణమూల్ కాంగ్రెస్‌లది దొంగ పోరాటమని అన్నారు. పంచాయతీల్లో దోపిడీకి పాల్పడుతున్న వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్య దర్శి మహ్మద్ సలీం, అమియా పాత్రా, డెబ్లినా హెంబ్రూమ్, సుదీప్ సేన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో సిపిఎం భారీ ర్యాలీలు

- కాషాయ పార్టీ నుంచి ప్రజాసంఘాల్లోకి వలసలు



అగర్తల : కొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపురలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. సిపిఎం నిర్వహిస్తున్న సభలకు, ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజానీకం హాజరవుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి నుంచి సిపిఎం ప్రజా సంఘాల్లోకి చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యువరాజ్ నగర్ లజ్‌నందతల్‌లో ఐదుగురు బిజెపి నాయకులు సిపిఎం ప్రజాసంఘాల్లో చేరారు. కళ్యాణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి మనింద్రా చంద్ర దాస్ విజయం కోరుతూ భారీ ర్యాలీ జరిగింది. ఎర్ర జెండాలతో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీ పాల్గొన్నారు. యువరాజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి షైలేంద్ర చంద్ర దేవ్‌నాథ్ విజయాన్ని కోరుతూ రామ్‌నగర్‌లో నిర్వహించిన సమావేశానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో పాణిసాగర్‌కు చెందిన నలుగురు బిజెపి నాయకులు సిపిఎంలో చేరారు. బగ్మా నియోజవర్గం లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి నరేష్ జమాతియా విజయాన్ని కోరుతూ ఫిత్రాని ఫోటమతి ప్రాంతంలో భారీ ప్రదర్శన జరిగింది. త్రిపురలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఐక్యంగా ప్రజానీకం కదలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. మాను నియోజవర్గంలో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి ప్రభాత్ చౌదరి విజయాన్ని కోరుతూ జరిగిన బంకుల్ మార్చ్‌లో వేలాది మంది ప్రజలు భాగస్వామ్యమయ్యారు. రెడ్‌ఝుందతల్‌లోని రైసబరియాలో బిజెపికి చెందిన ఎనిమిదిమంది కార్యకర్తలు సిపిఎం ప్రజాసంఘంలో చేరారు. మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సిపిఎం నిర్వహించిన ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజానీకం హాజరయ్యారు.

ముందున్నది మాంద్యం మంట

(మొదటి పేజీ తరువాయి)

98 శాతం వైర్‌లెస్.

గోళ్లూడగొట్టి పన్నులు : పన్నులు బాదడం వలన ప్రభుత్వ ఆదాయంలో 15.5 శాతం వృద్ధి కనిపిస్తోంది. జిఎస్‌టి వసూళ్లు ఏకంగా 24.8 శాతం పెరిగాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు డిబిటి (నగదు బదిలీ) విస్తరణ జరిగింది. దేశంలో నిరుద్యోగిత పెరుగుదల రేటు తగ్గినట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. 2018-19లో నిరుద్యోగిత 5.8 శాతం కాగా 2022-23లో 4.2 శాతానికి తగ్గిందని తెలిపింది.

వ్యవసాయంలో ప్రైవేటు కేపిటల్ : వ్యవసాయరంగంలోకి ప్రైవేటు పెట్టుబడులు 9.3 శాతం పెరిగాయి. రైతులకు ఒకటిన్నర రెట్ల ఎంఎస్‌పి ఇచ్చేసినట్లు ఆర్థిక సర్వే మరోసారి అసత్యాలు పలికింది. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపింది. పారిశ్రామిక వృద్ధి కొనసాగుతోందని, నిర్మాణరంగం పట్టాలకెక్కడంతో ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని, వలస కూలీలు తిరిగి పట్టణాలకు చేరడానికి తోడ్పడుతున్నాయని, ఫార్మారంగంలోకి నాలుగు రెట్ల ఎఫ్‌డిఐలు వచ్చాయని, సర్వీసు రంగం కోలుకుంటోందని తెలిపింది. ఆహారభద్రత సహా సమాజిక సర్వీసుల్లో ప్రభుత్వ ఖర్చు కొనసాగిందని, ఆరోగ్యరంగంలో ప్రభుత్వ ఖర్చు జిడిపిలో 2.2 శాతానికి చేరుకుందని ఆర్థిక సర్వే వివరించింది.

రాజధాని విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆరు విమానాశ్రయాలు కూడా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడు పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తునట్లు తెలిపారు. 'రాష్ట్రంలో 48 రకాల ఖనిజాల లభ్యత ఉందని చెప్పారు. విశాఖలో జరగనున్న సదస్సుకు హాజరు కావడంతో పాటు పెట్టుబడులకు కూడా ముందుకు రావాలని కోరారు. కియా మోటర్స్ ఎండి, సిఈఓ తాయి జిన్ పార్క్ (కొరియా) మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు బాగున్నాయని చెప్పారు. కృష్ణపట్నం, చెన్నై వంటి ప్రధాన ఓడరేవులు అందుబాటులో ఉన్నాయన్నారు. . టోరే ఇండస్ట్రీస్ ఎండి (జపాన్) యమగూచి మాట్లాడుతూ "ఏపిలో రూ.వెయ్యి కోట్లతో 2 బిజినెస్ యూనిట్లు ప్రారంభించాము. 2030 నాటికి ఉత్పత్తిని రెండింతలు చేస్తాము" అని చెప్పారు. క్యాడ్‌బరీ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ ధర్నారాజన్ అయ్యర్ (అమెరికా) మాట్లాడుతూ "ఏపి ప్రభుత్వం మాకు ఎంతో మద్దతు ఇస్తోంది. రూ.2,500 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాము. ఎంతో మందికి ఉపాధి కల్పించాము. రాబోయే రోజుల్లో మరిన్ని యూనిట్లు నెలకొల్పుతాము.' అని అన్నారు. ఎవర్టన్ టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రోషన్ గుణవర్ధన (ఇటలీ) మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తాము గణనీయంగా అభివృద్ధి చెందినట్లు చెప్పారు. ఏపి టి ఉత్పత్తి చేసే రాష్ట్రం కానప్పటికీ తమకు విస్తృత సహకారం అందించినట్లు చెప్పారు. అపాచీ అండ్ హిల్‌టాప్ గ్రూప్ డైరెక్టర్ సెర్గియో లీ (తైవాన్) మాట్లాడుతూ "100 శాతం ఎగుమతితో బూట్లు తయారు చేయడానికి మేము 2006లో స్థాపించాము. ఒప్పందంపై సంతకం చేసిన తొమ్మిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాము. ప్రభుత్వ మద్దతు లేకుండా ఇది సాధ్యం కాదు' అని చెప్పారు. సెయింట్-గోబెన్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సిఎండి ఫణి కునార్ (ఫ్రాన్స్) మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఫ్యాక్టరీని ప్రారంభించినట్లు,. అధికారుల నుంది అసాధారణ మద్దతు లభించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ దేశాల దౌత్యాధికారులు, కాన్సుల్ జనరల్స్‌కు, రాయబారులుకు, కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సిఐఐ సదరన్ రీజియన్ ప్రెసిడెంట్ సుచిత్రా ఎల్లాచ అసోచామ్ ప్రెసిడెంట్ సుమంత్ సిన్హా, నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్జానీ ఘోష్ పాల్గొన్నారు.

ఆశారామ్‌కు మరోసారి యావజ్జీవ ఖైదు



అహ్మదాబాద్ : తనకు తాను దేవుడినని చెప్పుకుని దేశవ్యాప్తంగా ఆశ్రమాలు నెలకొల్పిన ఆశారామ్‌కు మరో అత్యాచారం కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. రూ.50 వేల జరిమానా కూడా కోర్టు విధించింది. 2013లో గాంధీనగర్ సమీపంలోని ఆశారాం బాపూ ఆశ్రమంలో బస చేసిన బాధితురాలు తనపై అత్యాచారం జరిగిందంటూ కేసు పెట్టారు. తొమ్మిదేళ్లకుపైగా జరిగిన విచారణ ముగియడంతో ఆశారామ్‌కు జీవిత ఖైదు విధిస్తూ గాంధీనగర్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారన్న కేసులో జీవిత ఖైదీగా జోధ్‌పూర్ జైల్లో ఆశారామ్ ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారు.

కర్ణాటకలో అన్ని స్థానాల్లోనూ ఆప్ పోటీ

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామని ఆప్ ప్రకటించింది. ఈ విషయాన్ని మంగళవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఆప్ పార్టీ నాయకురాలు అతీష్ వెల్లడించారు. మార్చి మొదటి వారంలో అభ్యర్థుల తొలి జాబితా కూడా విడుదల చేస్తామని తెలిపారు.224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటకలో మరికొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి.

ద్వైపాక్షిక సహకారంపై అమెరికా నేతలతో అజిత్ దోవల్ చర్చలు

వాషింగ్టన్ : భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ మార్క్ మిల్లేతో సమావేశమయ్యారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక సహకారానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చలు విజయవంతంగా ముగిశాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం ట్వీట్ చేసింది. వాషింగ్టన్‌లోని ఇండియా హౌస్‌లో సోమవారం వీరి సమావేశం జరిగింది. అనంతరం దోవల్ గౌరవార్థం అమెరికాలో భారత రాయబారి తరంజిత్ సింగ్ సంధూ విందు ఏర్పాటు చేశారు. ఐసెట్ (కీలకమైన, కొత్తగా ఆవిర్భవిస్తున్న సాంకేతికతలపై భారత్-అమెరికా చొరవ) చర్చల ప్రారంభానికై ఉన్నతస్థాయి ప్రతినిధి వర్గంతో దోవల్ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు.

బంగ్లాదేశ్‌కు ఐఎంఎఫ్ రుణం!

ఢాకా : బంగ్లాదేశ్‌కు 470కోట్ల డాలర్ల రుణ ప్యాకేజీని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఆమోదించింది. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ఇంధన, ఆహార ధరల వ్యయాన్ని ఎదుర్కొనేందుకు గానూ ఈ రుణాన్ని అందిస్తోంది. దీనిలో 47.6 కోట్ల డాలర్ల మొత్తం తక్షణమే బంగ్లా ప్రభుత్వానికి అందుతుంది. ఐఎంఎఫ్ ఈ రుణాన్ని మంజూరు చేయడానికి పెట్టిన విషమ షరతులను బంగ్లా ప్రభుత్వం ఆమోదించాల్సి వచ్చింది.

నేడు కేంద్ర బడ్జెట్

- లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ బుధవారం ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలుత లోక్‌సభలో బడ్జెట్‌ను సమర్పిస్తారు. అనంతరం రాజ్యసభలో టేబుల్ చేస్తారు. పన్ను చెల్లింపుదారులు, సామాన్యులు తమకు అనుకూలంగా ఏం ఉంటుంది? తమపై భారాన్ని పెంచే వార్తలు ఏం రాబోతున్నాయి? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో సంక్షేమ పథకాలు కేటాయిస్తారని, రాయితీలు ఇస్తారని చాలా మంది ఆశిస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా బడ్జెట్ : ప్రధాని మోడీ

మన దేశ బడ్జెట్‌పై యావత్తు ప్రపంచం దృష్టి సారించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. ప్రపంచంలో నేడు ఉన్న పరిస్థితుల నేపథ్యంలో దేశ బడ్జెట్ గురించి తెలుసుకోవాలని మన దేశవాసులే కాకుండా, యావత్తు ప్రపంచం ఎదురు చూస్తోందని చెప్పారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా ఉన్నప్పటికీ మన దేశ బడ్జెట్ సామాన్యుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అన్ని విధాలుగా కృషి చేస్తారని తాను బలంగా నమ్ముతున్నానని తెలిపారు. 'దేశానికి పెద్ద పీట, ప్రజలకు పెద్ద పీట' అనే భావాన్ని స్వీకరించి తాము ఈ బడ్జెట్ సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను పార్లమెంటు ముందుంచుతారని ఆశిస్తున్నానన్నారు. ఆర్థిక రంగంలో గుర్తింపు పొందిన నిపుణుల నుంచి మన దేశం కోసం సానుకూల సందేశాలు వస్తున్నాయన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడం గర్వకారణమని తెలిపారు.

ఎపి ఉద్యోగ సంఘానికి ఊరట

- షోకాజ్ నోటీస్ ప్రకారం తుది చర్యలు తీసుకోవద్దు
- తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చేలా చట్టం చేయాలని కోరుతూ గవర్నర్‌ను కలిసిన ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసు ఆధారంగా తుది చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. షోకాజ్ నోటీస్‌ను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ సవాల్ చేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు ప్రకటించింది. తీర్పు వెలువడే వరకు షోకాజ్ నోటీస్ ఆధారంగా సంఘంపై తుది నిర్ణయం తీసుకోరాదని న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.పిటిషనర్ తరపు సీనియర్ అడ్వొకేట్ వై.వి.రవిప్రసాద్ వాదిస్తూ, నిబంధనల మేరకు ప్రతి నెలా ప్రారంభానికి ముందే అంటే నెల చివరి రోజున జీతాలు చెల్లించాలన్నారు. 15 రోజులు గడిచాక జీతాలు చెల్లిస్తున్నారని చెప్పారు. దీనిపై గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తే ప్రభుత్వ సంఘానికి షోకాజ్ నోటీసు ఇచ్చిందన్నారు.

ఓపిఎస్ కోసం ఫిబ్రవరి 3న సంకల్ప దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేస్తానని హామీ ఇచ్చి నాలుగేళ్లు అవుతున్నా అమలు చేయకపోగా జిపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. ఆచరణలో సిపిఎస్‌కు జిపిఎస్‌కు తేడా ఏమీ లేదని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలకు భద్రత కల్పించే విధానాలేవీ జిపిఎస్‌లో లేవన్నారు. రాష్ట్రంలో 3లక్షల మంది ఉద్యోగులు సిపిఎస్‌లో వున్నారని వారికంతా ఓపిఎస్‌ను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు ఉద్యోగుల డిమాండ్ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. పొరుగున వున్న తమిళనాడు కూడా ఏప్రిల్‌నుండి ఓపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కార్పోరేట్ల ప్రయోజనాల కోసం సిపిఎస్, జిపిఎస్ అంటోందని విమర్శించారు. ఇప్పటికే పలుదఫాలుగా ఉద్యోగులకు ఓపిఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న భారీ ఎత్తున సంకల్ప దీక్షను చేపడుతున్నట్లు తెలిపారు. గన్నవరం సమీపంలోని ధర్మస్థలిలో ఈ సంకల్పదీక్షను నిర్వహిస్తున్నామని రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు, రాజకీయపార్టీలు కూడా హాజరై ఉద్యోగుల ఓపిఎస్ పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. అలాగే సిపిఎస్ రద్దుపై రాష్ట్రంలోని రాజకీయపార్టీలు తమ వైఖరులను ప్రకటించాలని కోరారు.

రాణా అయూబ్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో ఉత్తరప్రదేశ్ కోర్టు తనకు సమన్లు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ జర్నలిస్టు రాణా అయూబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పును రిజర్వ్ చేసింది. సమన్లు దాఖలు చేసిన ఘజియాబాద్ కోర్టు తన అధికార పరిధిని ఉల్లంఘించిందని, చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేసిందని అయూబ్ తరపు న్యాయవాది వృందా గ్రోవెర్ వాదనలు వినిపించారు. జస్టిస్ వి.రామసుబ్రమణ్యం, జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఒక ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా సేకరించిన నిధులను నవీ ముంబయిలో ఒక బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసినట్లు అయూబ్‌పై మనీలాండరింగ్ కేసు నమోదయింది.

అటవీ హక్కుల చట్టం అమలు చేయండి

- ఆదివాసీల ఆందోళన

లక్నో : అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, ఆదివాసీలకు భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరప్రదేశ్ మిర్జాపూర్ జిల్లాలో గిరిజనులు ఆందోళన నిర్వహించారు. మరిహన్ తాలుకా రాజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అటవీ ప్రాంతాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఆర్ఎ అమలు కోసం ఈ ప్రాంతంలో సుమారు ఆరేళ్ల నుంచి పోరాడుతున్న సిపిఎం నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. ఎఫ్ఆర్ఎ



పేరుతో అటవీ అధికారులు తమను వేధిస్తున్నారని, డబ్బుల కోసం పీడిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై నమోదు చేసిన అక్రమ కేసుల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పిఎం కేర్స్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్

- ప్రభుత్వం నియంత్రించదు : కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : పిఎం కేర్స్ ఫండ్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. పిఎం కేర్స్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్టుగా ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. పార్లమెంటు చట్టం లేదా రాజ్యాంగం కింద దీని ఏర్పాటు జరగలేదని కేంద్రం.. న్యాయస్థానానికి తెలిపింది. కరోనా మహమ్మారి విజృంభణ నేపథ్యంలో 2020 మార్చిలో పిఎం కేర్స్ ఫండ్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఏదైనా ఎమర్జెన్సీ పరిస్థితి వస్తే ఎదుర్కొనే విధంగా దీనిని ఏర్పాటు చేశారు. పిఎం కేర్స్ ఫండ్ పనితీరులో పారదర్శకత ఉండేలా దాఖలైన పిటిషన్‌కు ప్రతిస్పందనగా కేంద్రం అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ట్రస్టు పనితీరులో ఇటు కేంద్రం లేదా అటు రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యక్ష లేదా పరోక్ష నియంత్రణ ఉండదని వివరించింది. ఈ నిధి "పబ్లిక్ అథారిటీ" కాదని సమాచార హక్కు చట్టం కింద కేంద్రం పునరుద్ఘాటించింది. వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే స్వచ్ఛంద విరాళాలను మాత్రమే నిధి స్వీకరిస్తుందని తెలిపింది.

నల్ల జాతీయుని హత్య కేసులో మరో పోలీసు సస్పెన్షన్

- ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది తొలగింపు

వాషింగ్టన్ : అమెరికావ్యాప్తంగా దిగ్భ్రాంతి కలిగించిన నల్లజాతి యువకుడు టైర్ నికొలస్ హత్య కేసులో మరో అధికారిని సోమవారం సస్పెండ్ చేశారు. దీంతో ఇప్పటివరకు సస్పెండైన వారి సంఖ్య ఏడుకి చేరింది. ఐదుగురు అధికారులను తొలగించి, వారిపై హత్యా అభియోగాలను నమోదు చేశారు. సంఘటనా సమయంలో ఆ ప్రదేశానికి చేరుకున్నప్పటికీ నికొలస్‌కు తగిన వైద్యసాయం అందించడంలో విఫలమైనందుకు ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని తొలగించినట్లు నగర అగ్నిమాపక శాఖ తెలిపింది. ఈ నెల 7వ తేదీన జరిగిన నికొలస్ హత్యలో ప్రమేయమున్న అధికారులపై పాలనా పరమైన దర్యాప్తులు ప్రారంభించినట్లు మెంఫిస్ పోలీసులు తెలిపారు. 2018లో పోలీసు విభాగంలో చేరిన హెంఫిల్‌ను ప్రస్తుతం సస్పెండ్ చేశారు.



మీకోసం

కూరల్లో పులుపు తక్కువైనప్పుడు మామిడి పొడితో పాటు కొంచెం పెరుగు కలిపి కూరలో వేస్తే టమోటా రుచి వస్తుంది.

జీవన సౌరభం

సన్మానం పొందడంలో గొప్పదనం లేదు. దానిని పొందడానికి నీకున్న అర్హతలోనే గొప్పదనం ఉంది.

గాలిపటం



గాలిపటమా! ఎగురవే
నీలినింగిని తాకవే
గద్దలే నిను తాకబోగా
ముద్దులాడుచు ఎగురవే!

మబ్బులతో దోబూచులాడవే
మనసులను మురిపించవే
మనుషులే అడ్డగించినా
మునుముందుకే తరలవే!

విహంగంలా ఎగురవే
వినువీధిన విహరించవే
వన్నెచిన్నెలు చూపుచూ
చిన్నారులను అలరించవే !

చెట్టుకొమ్మల చిక్కకే
చిక్కులు తెచ్చిపెట్టకే
చిన్నిబాలలు చిందులేసేలా
ఉన్నచోటనే ఊయలూగవే!

- చంద్రకళ దీకొండ,
మేడ్చల్

లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 186

నేను గీసిన బొమ్మ



- వై. రేష్మ,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి,
చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చైతన్య బోధన .. హక్కుల సాధన ...





ఆ గది.. బడి పిల్లలు చదువుకునే గది, ఓ గ్రంథాలయం, వినోద కేంద్రం, రాజ్యాంగ అవగాహనా కార్యక్రమం, మహిళలపై హింసను ఎదుర్కొనే వ్యూహాలను చర్చించే బహిరంగ ప్రదేశం, ఇంకా అనేక సమస్యలు చర్చించేందుకు మహిళలంతా సమావేశమయ్యే అధ్యయన కేంద్రం.. ఇలా అనేక ప్రయోజనాలే లక్ష్యంగా ఆ గది ఏర్పడింది.

'దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు.. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశభక్తి' అన్న అంబేద్కర్ ఆశయాలను అక్షరసత్యం చేస్తున్నారు ఆ యువత. తెలంగాణ సిద్ధిపేట జిల్లా బాడంపేట్ గ్రామంలో ఓ చిన్న గదిలో సమావేశమైన వారంతా భావిభారత ఉజ్వల భవిష్యత్తుకై తమవంతు కృషిచేస్తున్నారు. రేకులనే గోడలుగా నిర్మించుకున్న ఆ చిన్న గదిలో ఓ వైపు అమర్చిన ఇనుప రేకుల అరలో కులం, మతం, జాతి, లింగం ఆధారిత పుస్తకాలు నిండివున్నాయి. మరో వైపు 'సత్య శోధక యువజన సంఘం' పేరుతో ఓ బ్యానర్ తగిలించారు. 'మేల్కొనండి.. లేవండి.. బోధించండి.. సాంప్రదాయ సంకెళ్ల నుండి విముక్తలవ్వండి' అన్న సావిత్రిబాయ్ పూలే సూక్తి దానిపై రాసి ఉంది. సంఘ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ కేంద్రాన్ని 'రాజ్యాంగ బోధనా కేంద్ర'మని పిలుస్తారు.

సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా 8 గ్రామాలకు చెందిన షెడ్యూల్ కులాలు, ముస్లింలు, ఎస్‌సి, ఎస్‌టి వర్గానికి చెందిన 30 మంది యువతతో ఈ సంఘం ఏర్పడింది. వీరిలో ఎక్కువమంది రైతు కుటుంబాల నుండి వచ్చినవారు, పశువులను మేపేవారు, డిప్లొమా చేస్తున్నవారు, ఇద్దరు మాత్రమే డిగ్రీ చదువుతున్నారు. విభిన్న వర్గాలకు చెందిన వీరందరినీ ఏకం చేసింది ఒకే ఒక లక్ష్యం.. 'సమానత్వం - హక్కుల సాధన'.

24 ఏళ్ల విక్రమ్ బాడంపేట దళిత కుటుంబానికి చెందినవాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ, కూలిపనులకు వెళ్తూ ఆ కుటుంబం జీవిస్తోంది. 25 ఏళ్ల మహ్మద్ గౌస్ కూడా ఆ గ్రామానికే చెందిన సన్నకారు రైతు. వీరిద్దరి ఆలోచనల్లో నుండి వచ్చిన ఈ కేంద్రం ఇప్పుడు ఒక్క గ్రామానికే పరిమితమవ్వలేదు. చుట్టుపక్కల 8 గ్రామాలకు పాకింది. భవిష్యత్తులో మరింత విస్తృతస్థాయికి తీసుకెళ్లాలని ఈ మిత్రద్వయం ఆశిస్తోంది.

ఇది ఎప్పుడు మొదలైంది..

గ్రామీణ పిల్లలు, యువత, ఆర్థిక వనరుల లక్ష్యంగా మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన ఓ విద్యాకార్యక్రమంలో ఈ యువత తొలిసారి సమావేశమైంది. అక్కడే వారి ఆలోచనలను, ఆశయాలను చర్చించుకున్నారు. అప్పుడే ఓ లక్ష్యం ఏర్పర్చుకున్నారు. దాన్ని ఆచరణలో పెట్టారు. అలా 2019 చివరినాటికి సంఘం ఏర్పడింది.

ఎన్నో అడ్డంకులు..

సిఖింద్లపూర్‌లో ఉండే 24 ఏళ్ల కొయ్య శివాజీ తన గ్రామంలో ఈ కేంద్రాన్ని స్థాపించాలనుకున్నప్పుడు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొవాల్సి వచ్చింది. 'దేశం బాగుపడింది.. చాలా బాగుపడింది.. అని అందరూ అంటుంటారు. కాని మేము ఇంకా కులం, మతం, జాతి, లింగ వివక్షతో కొట్టుమిట్టాడుతున్నాం. సరైన మార్గదర్శకత్వం లేక మా భవిష్యత్తు అంధకారమైంది. మా తర్వాతి తరాలైన బాగుపడాలని కోరుకుంటున్నాం. ఆ విషయాలనే పెద్దలకు చెప్పి ఒప్పించాం. అందుకోసం చాలా శ్రమపడాల్సి వచ్చింది' అంటున్నాడు శివాజీ.

గ్రామీణ ప్రాంత చిన్నారులను కలసి రోజువారీ తరగతి గదులు నిర్వహిస్తున్నారు. 'ఇక్కడ బోధించే అంశాలు తరగతి బయట నేర్చుకునేవి. క్లాసులకు హాజరయ్యే పిల్లల్లో చాలామంది షెడ్యూల్ కులాల వారు ఉంటున్నారు. అదే మా మొదటివిజయం' అంటున్నాడు శివాజీ.





సంఘం ఏం చేస్తుంది?

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఏర్పడ్డ ఈ సంఘం విద్యాబోధన, విజ్ఞాన కేంద్రంగానే కాక, సామాజిక సేవలో కూడా భాగమైంది. సంఘం తరపున కూరగాయలు, రోగనిరోధక శక్తిపెంచే పండ్లు, ఇతర సామాగ్రి గ్రామస్తులకు పంచిపెట్టారు. లాక్‌డౌన్‌లో ఆన్‌లైన్ తరగతులకు హాజరవ్వలేని పేద పిల్లలందరికీ విద్యాబోధన చేశారు. కొన్ని కేంద్రాల్లో సబ్జెక్టు వారీగా తరగతులు నిర్వహించారు. కళలు, చేతిపనులను నేర్పించారు. 2021లో రాజ్యాంగ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. భవిష్యత్తులో అన్ని గ్రామాల్లో ఈ ర్యాలీలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా అనేక కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.

మహిళలు ఎదుర్కొనే హింసపై..

'మహిళలపై జరుగుతున్న హింస ఎదుర్కొనడం.. అందుబాటులో ఉన్న మార్గాలపై అవగాహన కల్పించడంలో సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది' అంటున్న కృపకు 20 ఏళ్లకే వివాహమైంది. చిన్న బాబు ఉన్నాడు. 'సామాజికంగా అణిచివేత అనుభవించిన నా కంటే ఇంకెవ్వరు సంఘంలో పాల్గొంటారు.. అందుకే సంఘం తరపున నిర్వహించే అన్ని కార్యక్రమాలకు నేను హాజరవుతాను' అంటోంది.

'విద్యార్థులను, మహిళలను అనుసంధానం చేస్తూ ఏడాదిపొడవునా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘం, వివక్షకు గురైన వారి సమస్యలు, అవకాశాల కొరత, ఆశలు మొదలైన వాటి గురించి మాట్లాడే వీలు కల్పిస్తోంది. అందుకే వారంతా ఇక్కడికి వచ్చేందుకు ఎంతో సుముఖంగా ఉంటున్నారు' అంటోంది గోవిందరాజు పల్లె కేంద్రంలో పాల్గొనే రేణుక.

కాలేజీ యువత కూడా రావాలి..


'కాలేజీ విద్యార్థులు, యువత సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేలా పెద్ద కసరత్తు చేయాల్సివస్తోంది. సాధారణంగానే యువత ఇటువంటి విషయాల పట్ల చాలా ఉదాసీనంగా ఉంటున్నారు. మేం చెప్పే విషయాలను తెలుసుకోవడానికి వారు ఆసక్తి చూపరు. వారిని సంఘం వైపు నడిపించేందుకు ఎంతో శ్రమపడుతున్నాం' అంటున్నాడు మొగులయ్య. సికింద్లాపూర్‌కు చెందిన మొగులయ్య బీటెక్ చదువుతున్నాడు. ఉద్యోగం చేయాలని ఆశపడుతున్నాడు. ఉద్యోగం వచ్చినా సంఘంలో చురుకుగా పాల్గొంటానని చెబుతున్నాడు. ఈ యువత చేస్తున్న ఈ కృషి ఎంతోమంది యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.




బడ్జెట్ ఫ్రెండ్లీగా టికెట్ ధరలు

హీరో సుహాస్ 'రైటర్ పద్మభూషణ్' చిత్రంలో నటిస్తున్నాడు. ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని షణ్ముఖ ప్రశాంత్ డైరెక్షన్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 3న థియేటర్లలో విడుదలకు సిద్ధం అయ్యింది. ఈ నేపథ్యంలో సుహాస్ టీం ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్స్ కార్యక్రమాలు చేస్తుంది. మూవీ లవర్స్ కోసం టికెట్ రేట్ల అప్‌డేట్ అందించారు మేకర్స్. ఫ్యామిలీతో వెళ్లాలంటే టికెట్ రేట్లు బడ్జెట్‌లో ఉండేలా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సింగిల్ స్క్రీన్స్ థియేటర్లలో (బాల్కనీ) రూ.110, మల్టీప్లెక్స్ లో తెలంగాణలో రూ.150, ఏపీలో రూ.177గా (జీఎస్టీతో కలిపి) నిర్ణయించారు. జీ మనోహరన్ సమర్పణలో లహరి ఫిలిమ్స్ -ఛాయ్ బిస్కెట్ ఫిలిమ్స్ బ్యానర్లపై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శేఖర్ చంద్ర, కల్యాణ్ నాయక్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

పైరసీ 'మాయగాడు' ట్రైలర్ విడుదల



నవీన్ చంద్ర హీరోగా గాయత్రీ సురేష్, పూజా జవేరి హీరోయిన్స్‌గా, జీ.ఎస్. కార్తీక్ రెడ్డి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'మాయగాడు'. స్వాతి పిక్చర్స్ బ్యానర్‌పై, భార్గవ్ మన్నె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. పైరసీ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న లవ్ స్టోరీ ఇది. ఈ సినిమాలో హీరో కొత్త సినిమాలను పైరసీ చేస్తుంటాడు. పైరసీ వలన సినీ పరిశ్రమకు ఏర్పడే నష్టాలను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈ సినిమా విడుదలకానుంది.



విజయ్ చిత్రంలో సంజయ్ దత్ వచ్చేశాడు..

విజయ్, లోకేశ్ కనగరాజ్ కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రంలో సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన సెట్‌లోకి వచ్చిన ఈ విషయాన్ని చిత్ర బృందంతో పాటు సంజయ్ దత్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా సంజయ్ కొత్త లుక్‌ను విడుదలచేశారు. 'సంజయ్‌దత్ మా చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది' అంటూ చిత్ర యూనిట్ ట్విట్టర్‌లో పేర్కొంది. సంజద్ దత్ కూడా దీనిపై స్పందించారు. 'విజయ్ 67' లైన్ విన్నప్పుడు తప్పకుండా ఈ చిత్రంలో భాగం కావాలనుకున్నా. ఇప్పుడు ఈ జర్నీని ప్రారంభించడానికి ఎంతో థ్రిల్లింగ్‌గా ఎదురుచూస్తున్నా' అని పోస్టర్‌లో పేర్కొన్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.ఎస్. లలిత్‌కుమార్, జగదీష్ పళనిస్వామి నిర్మిస్తున్నారు. విక్రమ్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు చేస్తున్నారు.

మైఖేల్ బయోపిక్‌కు రంగం సిద్ధం



పాప్ కింగ్ మైఖేల్ జాక్సన్ జీవితం ఆధారంగా సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైఖేల్ ప్రధాన పాత్రలో ఆయన మేనల్లుడు జాఫర్ నటిస్తున్నారు. ఈ విషయాన్ని జీకే స్టూడియోస్ తెలిపింది. ఈ చిత్రానికి ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించనున్నారు. గ్రాహం కింగ్ నిర్మాతగా వ్యవహరించనున్నారు. జాఫర్ చాలా కాలంగా మైఖేల్ పాత్ర కోసం సిద్ధమవుతున్నాడు. ఇందుకు సంబంధించి జాఫర్ బ్లాక్ అండ్ వైట్ ఫొటోను జీకే ఫిల్మ్స్ షేర్ చేసింది. మైఖేల్ జాక్సన్ ఎస్టేట్ కో ఎగ్జిక్యూటర్, ఎంటర్‌టైన్‌మెంట్ లాయర్ అయిన జాన్ బ్రాంకా.. మైఖేల్ బయోపిక్‌లో ప్రధాన పాత్రను ఆయన మేనల్లుడు జాఫర్ పోషిస్తున్నట్లు వెల్లడించే వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. మైఖేల్ జాక్సన్‌తో జాఫర్‌కు ప్రత్యేక అనుబంధం ఉన్నదని ఆయన చెప్పారు. చిన్న వయసు నుంచే మైఖేల్‌ను ఫాలో అవుతున్నందున వాకింగ్ స్టైల్ ఒక్కటే కాకుండా వాయిస్ కూడా అచ్చం మైఖేల్‌ని పోలి ఉంటుందన్నారు. ఈ పాత్ర కోసం జాఫర్ గత 6 నెలలుగా కష్టపడుతున్నాడని బ్రాంకా ఆ వీడియోలో వెల్లడించారు.



ఫిబ్రవరి 3న 'సువర్ణసుందరి'

సీనియర్ నటి జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రలలో నటించిన 'సువర్ణసుందరి' చిత్రం ఫిబ్రవరి 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్, డిజిటల్ టికెట్‌ను దిల్ రాజు లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు చెప్పారు. డాక్టర్ ఎమ్‌వికె రెడ్డి సమర్పణలో ఎస్ టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎమ్.ఎల్. లక్ష్మీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేంద్ర మాదారపు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఇంద్ర, రామ్, సాయికుమార్, కోట శ్రీనివాసరావు, నాగినిడు, అవినాష్, సత్యప్రకాశ్ తదితరులు నటించారు.

రికీ బుయ్ సెంచరీ

ఆంధ్ర 262/2
రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్



ఇండోర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో రికీ బుయ్, కరణ్ షిండే బ్యాటింగ్‌లో చెలరేగడంతో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలిరోజు గౌరవప్రద స్కోర్ చేయగల్గింది. వికెట్ కీపర్ రికీ బుయ్(115), కరణ్ షిండే(83) అజేయంగా నిలవడంతో తొలి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రప్రదేశ్ జట్టు 2 వికెట్ల నష్టానికి 262పరుగులు చేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టుకు ఓపెనర్లు జ్ఞానేశ్వర్(24), అభిషేక్ రాయుడు(22) నిరాశపరిచారు. దీంతో ఆంధ్ర జట్టు 58పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ విహారి(15 రిటైర్డ్‌హర్ట్) గాయంతో మైదానాన్ని వీడినా.. మూడో వికెట్‌కు రికీ బుయ్, కరణ్ షిండే కలిసి ఇప్పటికే 204 పరుగులు జతచేశారు. మధ్యప్రదేశ్ బౌలర్ గౌరవ్ యాదవ్‌కు రెండు వికెట్లు లభించాయి.

రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న రంజీ ట్రోఫీ రెండో క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ పార్థ్ భట్ (111 నాటౌట్; 11ఫోర్లు, 4సిక్సర్లు) అజేయమైన శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్నెల్ పటేల్(70)అర్ధ సెంచరీతో రాణించాడు. వీరిద్దరు మినహా జట్టు మొత్తం మూకుమ్మడిగా విఫలమైంది. పంజాబ్ బౌలర్లలో మార్కండేకు నాలుగు,, బల్తేజ్ సింగ్, సిద్ధార్థ్ కౌల్‌కు రెండేసి, నమన్ ధిర్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పంజాబ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 3 పరుగులు చేసింది. మరో క్వార్టర్‌ఫైనల్లో బెంగాల్ బౌలర్లు చెలరేగడంతో జార్ఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 173పరుగులకే కుప్పకూలగా.. ఉత్కరాఖండ్ జట్టు 116పరుగులకే తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ కాగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 123పరుగులు చేసింది.

భారత హాకీ జట్టుకు 6వ ర్యాంక్

టాప్‌లో జర్మనీ.. ఎఫ్‌ఐహెచ్ ర్యాంకింగ్స్ విడుదల



న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్(ఎఫ్‌ఐహెచ్) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు 6వ ర్యాంక్‌ను కాపాడుకుంది. భువనేశ్వర్ వేదికగా జరిగిన ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్ ముగియడంతో జట్ల ర్యాంకింగ్స్‌ను ఎఫ్‌ఐహెచ్ మంగళవారం విడుదల చేసింది. టోర్నీ ప్రారంభానికి ముందు అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా జట్టు తాజా ర్యాంకింగ్స్‌లో నాల్గోస్థానానికి పడిపోగా.. టైటిల్ విజేతగా నిలిచిన జర్మనీ జట్టు మూడు స్థానాలు ఎగబాకి ఏకంగా అగ్రస్థానానికి చేరిది. టోర్నీకి ఆతిథ్యమిచ్చిన భారతజట్టు ర్యాంక్‌లో మార్పు చోటు చేసుకోలేదు. భారతజట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరడంలో విఫలం కావడంతో కోచ్ గ్రాహం రీడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

ఎఫ్‌ఐహెచ్ తాజా ర్యాంకింగ్స్..

1.	జర్మనీ	2912.47
2.	నెదర్లాండ్స్	2848.29
3.	బెల్జియం	2845.82
4.	ఆస్ట్రేలియా	2792.96
5.	ఇంగ్లండ్	2536.24
6.	ఇండియా	2478.22
7.	అర్జెంటీనా	2260.32
8.	స్పెయిన్	2093.52
9.	కొరియా	1942.50
10.	న్యూజిలాండ్	1899.79

సిరీస్ కొట్టేదెవరో..?

భారత్-న్యూజిలాండ్ చివరి టి20 నేడు
రాత్రి 7.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



అహ్మదాబాద్: సిరీస్‌ను విజేతను నిర్ణయించే చివరి, మూడో టి20కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. రికార్డుస్థాయి ప్రేక్షకులు వీక్షించగల ఈ మైదానంలో జరిగే మూడో టి20ని చేజిక్కించుకొనేందుకు ఇరుజట్లు హోరాహోరీగా తలపడడం ఖాయం. వన్డే సిరీస్‌ను చేజార్చుకున్న న్యూజిలాండ్ జట్టు ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి సిరీస్‌ను కొట్టేయాలని భావిస్తుండగా.. తొలి టి20లో ఓడిన టీమిండియా రెండో టి20లో సమిష్టిగా రాణించింది. సిరీస్‌ను తేల్చే మ్యాచ్‌లో టీమిండియా సమిష్టిగా రాణిస్తేనే సిరీస్‌ను చేజిక్కించుకోనుంది. వన్డే సిరీస్‌లో రాణించిన శుభ్‌మన్ ఫామ్‌లేమి టీమిండియాను కలవరపరుస్తోంది.

నేటి నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్

సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్ బుధ వారం నుంచి ప్రారంభం కానుందని సాంకేతిక విద్య కమిషనర్ సిహెచ్ నాగరాణి వెల్లడించారు. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రారంభమయ్యే స్పోర్ట్స్‌మీట్ ఈ నెల 3వ తేది వరకు జరగనుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు రీజియన్ల నుంచి దాదాపు 1700 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

రైల్వే ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో చరణ్‌రెడ్డికి స్వర్ణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

12వ ఆలిండియా రైల్వే ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్‌లో పర్సనల్ డిపార్టుమెంట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై చరణ్‌రెడ్డి స్వర్ణ పతకం సాధించారు. ఈ పోటీలు చిత్తరాజన్‌లో జనవరి 29నుంచి 31వరకు జరిగినట్లు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఇదే ఆర్చరీ పోటీలో ఎస్అండ్ టి డిపార్టుమెంట్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న సునేందురాయ్ ర్యాంకింగ్ అండ్ ఎలిమినేషన్ (ఒలింపిక్స్)లో రెండు కాంస్య పతకాలను సాధించారు. ఎస్‌సి రైల్వే ఆర్చరీ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించారు. వీరిద్దరినీ విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు శివేంద్ర మోహన్, ఎడిఆర్ఎం డి.శ్రీనివాసరావు, ఎడిఆర్ఎం ఆపరేషన్స్ ఎం శ్రీకాంత్ వల్లేశ్వర, సీనియర్ డిఎస్‌సి ఎం బాల మరళీధర్, సీనియర్ డిపిఓ ఆర్ విశ్వనాద్‌రెడ్డి పతకాలు సాధించిన ఉద్యోగులను మంగళవారం అభినందించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68